

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి వరద ప్రవాహం రోజురోజుకు పెరుగుతోంది. బుధవారం 5,054 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగగా గురువారం నాటికి 8,928 క్యూసెక్కులకు పెరిగింది. అదేస్థాయిలో డ్యాంలోనూ నీటినిల్వ సామర్థ్యం పెరుగుతోంది. ప్రస్తుతం 27.880 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 3,900 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



ఎక్కడి వాళ్లు అక్కడే

గప్‌చుప్!



- కేసుల భయంతో మాజీ మంత్రి అనిల్ అనుచరుల పరార్
- మొబైళ్లు స్విచ్ఛాఫ్ చేసి అజ్ఞాతంలోకి..
- ముమ్మరంగా జల్లెడ పడుతున్న పోలీసులు

నెల్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : క్వార్ట్జ్ అక్రమ రవాణా వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అనుచరులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ వ్యవహారంలో అనిల్ తన చేతికి మట్టి అంటకుండా తన అనుచరుల ద్వారా వ్యవహారం చక్కబెట్టుకున్నట్లు పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అనిల్ అనుచరులుగా వ్యవహరించిన వారి జాబితా ఇప్పటికే పోలీసులు సిద్ధం చేశారు. అనిల్ ముఖ్య అనుచరుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని అరెస్టు చేయడం, అతను క్వార్ట్జ్ అక్రమ రవాణా వ్యవహారంలో మాజీ మంత్రులు అనిల్, కాకాణి పాత్రతోపాటు సహకరించిన వారి పేర్ల జాబితాను సైతం పోలీసులకు తెలియజేశారు. దీంతో తమ అరెస్టు తప్పదని భావించిన అనిల్ అనుచరులు జిల్లా విడిచి పరారయ్యారు.

● తప్పించుకున్న జిమ్ శ్రీకాంత్

క్వార్ట్జ్ అక్రమ సంపాదన మొత్తం అనిల్ అనుచరుల చేతుల మీదుగా నడిచినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే అదుపులోకి తీసుకున్న బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల బ్యాంక్ స్టేట్‌మెంట్లు సంపాదించిన పోలీసులు, ఇతర అనుచరుల ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించారు. ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన జిమ్ శ్రీకాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించారు. అయితే అతను త్రుటిలో తప్పించుకొని విదేశాలకు పరారయినట్లు ప్రచారం జరుగుతోంది. క్వార్ట్జ్ అక్రమ రవాణాలో అనిల్‌కు శ్రీకాంత్‌రెడ్డి కుడిభుజంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. క్వార్ట్జ్ క్వారీలు విస్తారంగా ఉన్న గూడూరు డివిజన్‌లో మొత్తం వ్యవహారాలను జిమ్ శ్రీకాంత్‌రెడ్డే చూసేవాడని ప్రచారం. ఈ క్రమంలో అక్రమ క్వార్ట్జ్ విక్రయాల ద్వారా వచ్చిన కోట్లాది రూపాయాల లావాదేవీలు శ్రీకాంత్‌రెడ్డి ద్వారానే జరిగినట్లు తెలుస్తోంది. దీనికి తోడు గూడూరు డివిజన్ పరిధిలో లీజుదారుల నుంచి టన్నుకు పది వేలు వసూళ్లు చేసే వ్యవహారాలను జిమ్ శ్రీకాంత్‌రెడ్డే చూసేవాడని అంటున్నారు. దీంతో ఆయన్ను అదుపులోకి తీసుకోవాలని ప్రయత్నించారు. అజ్ఞాతంలోకి వెళ్లిన ఈయన్ను వెనక్కు రప్పించే మార్గాలను పోలీసులు అన్వేషిస్తున్నారు.

● ముమ్మరంగా గాలింపు

ఏడాదిన్నర కాలంపాటు అడ్డూ అదుపులేకుండా జరిగిన ఈ క్వార్ట్జ్ అక్రమ రవాణాలో బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, జిమ్ శ్రీకాంత్‌రెడ్డిలతోపాటు ఇంకా పలువురు అనిల్ మనుషులుగా వ్యవహరించారు. ప్రధానంగా క్వార్ట్జ్ కొనుగోలు కంపెనీల నుంచి నగదును తమ అకౌంట్లలో వేసుకొని, వాటిని మరో రూపంలో అనిల్‌కు, తాడేపల్లి ప్యాలెస్‌కు చేర్చిన వ్యక్తులు పదుల సంఖ్యలో ఉన్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. వీరిందరి కోసం గాలింపు చర్యలు మొదలయ్యాయి. అయితే బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి అరెస్టు, ఆయన ఇచ్చిన వాగ్మూలంతో క్వార్ట్జ్ అక్రమాల్లో భాగస్వామ్యులైన అనిల్ అనుచరులంతా అప్రమత్తం అయ్యారు. అందరూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వీరి మొబైల్ ఫోన్లు కూడా స్విచ్ ఆఫ్ అయి ఉన్న విషయం ప్రస్తుతం నెల్లూరులో హాట్ టాపిక్‌గా మారింది.



ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య పనుల టెండర్లు

రద్దు చేయాల్సిందే!

- ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు
- నగరంలో మున్సిపల్ కార్మికుల భారీ ప్రదర్శన

నెల్లూరు (వైద్యం) జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్‌లో పారిశుధ్య పనులకు టెండరు పిలిచే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గాంధీబొమ్మ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వర్క్ అవుట్‌సోర్సింగ్ పేరుతో పారిశుధ్య కార్మికులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడం, ఇది కూడా మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సొంత నియోజకవర్గంలో శ్రీకారం చుట్టడం అన్యాయమన్నారు. 279 జీవోకు వ్యతిరేకంగా గతంలో ఆందోళన చేయడంతో వెంటనే అప్పటి ప్రభుత్వం జీవోను రద్దు చేసిందని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు భద్రత లేకుండా, జీతాలు సక్రమంగా ఇవ్వకుండా ఉండే కాంట్రాక్టర్‌లకు టెండరు ద్వారా అప్పగించే విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ నిరసనలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, రాష్ట్ర కోశాధికారి జ్యోతిబసు, సీపీఎం నేతలు కత్తి శ్రీనివాసులు, కొండాప్రసాద్, పెంచల నర్సయ్య, సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, సుధాకర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ శ్రీపూజ ఎదుట వాపోతున్న గ్రామస్థులు

మా ప్రాణాలు తీసి

మైనింగ్ తవ్వుకోండి!

- గతంలోనే హెచ్చరించినా మారరా!?
- అధికారులపై జంగంరెడ్డిపల్లి వాసుల ఆగ్రహం
- భారీ బందోబస్తు నడుమ ప్రజాభిప్రాయ సేకరణ
- గ్రామస్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు : సబ్‌కలెక్టర్

8 లో..



బొప్పాయి రైతుకు

ఊరట

- కేజీ రూ.4 నుంచి రూ.13లకు పెరిగిన ధర

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధర పెరగడంతో సాగుదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత నెల ఇదే సమయానికి కేజీ రూ.4 పలకగా.. నేడు రూ.10 నుంచి 13లకు చేరడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అనంతసాగరం మండలంలోని అగ్రహారం, సంజీవనగరం, గౌరవరం, బొమ్మవరం తదితర గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో బొప్పాయి సాగులోం ఉంది. ఒక ఎకరా సాగు కోసం రూ. లక్ష నుంచి 1.2 లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. రెండు నెలలుగా దిగుబడి చేతుకొందుతోంది. ఈక్రమంలో గత నెలలో దిగుబడికి సరైన గిట్టుబాటు లేక సాగుదారులు ఆందోళనకు గురయ్యారు. క్రమేణా మార్కెట్ ధర పుంజుకోవడంతో పెట్టుబడి పోను మిగులు ఆదాయం సమకురుతున్నట్లు రైతులు చెబుతున్నారు. కాయలను పేపర్లలో చుట్టి లారీల ద్వారా పూణె, ముంబాయి, నాగపూర్ మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు.

పథకాల అమలు

ఎలా ఉంది?

- నేటి నుంచి జాతీయ పర్యవేక్షణ బృందం పర్యటన

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ, సామాజిక పింఛన్లు, గృహ నిర్మాణం మొదలైన పథకాల అమలు తీరును పరిశీలించేందుకు శుక్ర వారం నుంచి జాతీయ స్థాయి బృందం పర్యటించనుంది. ఆ బృంద సభ్యులు డాక్టర్ ప్రశాంత్‌కుమార్, డాక్టర్ మణికందన్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను మర్యాద పూర్వ కంగా కలిశారు. అనంతరం జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ సమా వేశం నిర్వహించారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన బృంద సభ్యులకు సహాయ సహకా రాలు అందించాలని, క్షేత్రస్థాయిలో అమల వుతున్న సంక్షేమ పథకాలను సభ్యులకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ గంగాభవానీ, జడ్పీ సీఈవో మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ పథకాల అమలు తీరును ఢిల్లీ బృంద సభ్యులు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. వచ్చే నెల 2వతేదీ వరకు జిల్లాలో వీరి పర్యటన కొనసాగనుంది.

సీఎస్ఈకి జై!

జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో తొలివిడత సీట్ల కేటాయింపు జాబితాను ఏపీ ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో చేరేందుకు సన్నద్ధమవుతున్నారు. మరికొంత మంది విద్యార్థులకు తాము కోరుకున్న కళాశాలల్లో సీట్లు రాకపోవడంతో మలివిడత కౌన్సెలింగ్‌కు సమాయత్తమవుతున్నారు. మరోవైపు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) వైపు అత్యధిక శాతం మంది మొగ్గు చూపారు. కోర్సు పూర్తి చేసి పెద్ద కంపెనీల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొంది రూ.లక్షల్లో జీతాలు అందుకోవచ్చన్న ఆశతో విద్యార్థులు సీఎస్ఈనే ఎంచుకున్నారు.

- తొలివిడత ఇంజనీరింగ్ సీట్ల భర్తీ పూర్తి
- 9,715 సీట్లకు 6,409 భర్తీ
- అత్యధికశాతం మంది కంప్యూటర్ సైన్స్‌పైనే మొగ్గు
- వచ్చే నెల 4న తరగతుల ప్రారంభం
- త్వరలో మలివిడత కౌన్సెలింగ్

ముఖ్య కోర్సుల్లో భర్తీ అయిన సీట్లు

కోర్సులు	సీట్లు	భర్తీ
సీఎస్ఈ	3972	2672
ఏఐఎంఎల్	1296	985
సీఎస్‌డీ	216	22
సీసీ/ఏఐడీ	768	697
ఈసీఈ	1632	1132
ఈఈఈ	372	177
ఏఐ/సీఏఐ	715	581
ఎంఈసీ	276	113
సివిల్	228	98
ఐఎన్ఎఫ్/డీఎస్/సీఎస్‌వో/ఐవోటీ	192	12
ఈవీటీ	48	0

నెల్లూరు(విద్య), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు 2025-26 విద్యాసంవత్సరానికి 11,560 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంజనీరింగ్‌లో 5,993 మంది, వ్యవసాయ, ఫార్మసీ విభాగంలో 2,263 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని 13 ఇంజనీరింగ్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ సీట్లు, కన్వీనర్ కోటా సీట్లు కలిపి 9,715 సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి అనుమతులిచ్చింది. గతేడాది 8,722 సీట్లకుగాను 6,788 సీట్లు (81.03 శాతం) భర్తీ అయ్యాయి. ఈ విద్యా సంవత్సరంలో 9,715 సీట్ల భర్తీకి అనుమతులివ్వగా తొలి విడతలో 6,409 సీట్లు భర్తీ అయ్యాయి. కొంతకాలంగా ఇంజనీరింగ్ కళాశాలల్లో క్యాంపస్ ఎంపికలను నిర్వహిస్తుండటం, పలు ఎంఎన్‌సీ కంపెనీలు విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తుండటంతో ఇతర జిల్లాలకు చెందిన విద్యార్థులు కూడా జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరుతున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 26వ తేదీ లోపు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేసుకుని అడ్మిషన్లను నిర్ధారించుకోవాలి. అనంతరం ఆగస్టు 4వ తేదీన తరగతులు ప్రారంభమవుతాయి.

● జిల్లాలో భర్తీ అయిన సీట్లు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 13 ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ వివరాలను అధికారులు ప్రకటించారు. నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో 912 సీట్లకు 900 సీట్లు భర్తీ అయ్యాయి. గూడూరులోని నారాయణ కళాశాలలో 792 సీట్లకు 776, ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో 216 సీట్లకు 205 సీట్ల భర్తీతో వరుస మూడు స్థానాల్లో నిలిచాయి. వాకాడులోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 1104 సీట్లకు 1026 సీట్లు, గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో 768 సీట్లకు 677, ఏఎస్ఈటీలో 456 సీట్లకు 327, ఆర్ఎస్ఆర్ఎస్ కళాశాలలో 624 సీట్లకు 440 సీట్లు భర్తీ

- మిగతా 7లో..

నెల్లూరు మీదుగా షిరిడికి ప్రత్యేక రైళ్లు



ఆగస్టు 3 నుంచి సెప్టెంబరు 29 వరకు..

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ని సాయినాధుడి భక్తులకు దక్షిణ మధ్య రైల్వే తీపిక బురు అందించింది. తిరుపతి నుంచి నెల్లూరు మీదుగా షిరిడికి ఆగస్టు 3వ తేదీ నుంచి ప్రతి ఆదివారం 9 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే ప్రకటించింది. తిరుపతిలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు రైలు (నెం.07637) బయలుదేరి సోమవారం ఉదయం 10.45 గంటలకు సాయినగర్ (షిరిడి)కి చేరుకుంటుంది. అదేవిధంగా సాయినగర్ నుంచి ప్రతీ సోమవారం రాత్రి 7.35 గంటలకు రైలు (నెం.07638) బయలుదేరి మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నెల్లూరు, గూడూరు స్టేషన్లలో మాత్రం ఈ రైళ్లు ఆగుతాయి. సెప్టెంబరు 29 తేదీ వరకు ఈ రైళ్లు నడవనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేషన్ తీసుకోకపోయినా తీసుకున్నట్లు లెక్కలు

ఐవీఆర్ఎస్ సర్వేలో అక్రమాలు వెలుగులోకి

బియ్యం భోక్తల

గుట్టు రట్టు!

నెల్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రేషన్ దుకాణాల కేంద్రంగా జరుగుతున్న అక్రమాల గుట్టు రట్టయ్యింది. పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి పడుతున్నట్లు ప్రభుత్వ సర్వేలో తేలింది. కార్డుదారులకు సరుకులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు లెక్కలు రాస్తున్నట్లు నిర్ధారణ జరిగింది. జిల్లాలో రేషన్ పంపిణీ తీరును ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ప్రభుత్వం ఇటీవల ఐవీఆర్ఎస్ సర్వేను చేపట్టింది. ఒక్కో మండలంలో కొంత మంది కార్డుదారులను ర్యాండమ్‌గా సెలక్ట్ చేసుకొని వారికి కాల్స్ చేసింది. జిల్లాలో సుమారు 10 వేల మంది కార్డుదారుల వరకూ ఫోన్ చేసినట్లు తెలిసింది. అందులో 1,138 మంది కార్డుదారులు తాము సరుకులు తీసుకోలేదని సమాధానమిచ్చారు. అంటే కార్డుదారులకు సరుకులు ఇవ్వకపోయినా దుకాణాల్లో మాత్రం ఇచ్చినట్లు లెక్కలు చూపిస్తున్నారన్న మాట. అయితే ఐవీఆర్ఎస్ సర్వే వందకు వంద శాతం కరెక్టుగా ఉంటుందని చెప్పలేం గానీ, అయితే అందులో చాలా వరకూ వాస్తవికత ఉంటుందన్నది నిజం. దీనిని బట్టి చూస్తే జిల్లాలోని రేషన్ దుకాణాల కేంద్రంగా అవకతవకలు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ దుకాణాల కేంద్రంగా రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు వస్తున్న ఆరోపణలకు ఈ ఐవీఆర్ఎస్ సర్వే బలాన్ని చేకూరుస్తోంది.

- 10 వేల మందికి కాల్స్.. 1,138 మంది తీసుకోలేదని సమాధానం
- రేషన్ దుకాణాల తనిఖీకి ప్రభుత్వం ఆదేశం
- మాఫియా ఆగడాలకు ఇకనైనా చెక్ పడేనా!?

● తనిఖీలకు ఆదేశం

జిల్లాలో ఏడు లక్షల రేషన్ కార్డులు ఉండగా, సుమారు 20 లక్షల మంది రేషన్ బియ్యాన్ని తీసుకుంటున్నారు. ప్రతి నెలా సుమారు 10 వేల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. నెలలో సరాసరి 87 శాతం మంది బియ్యం తీసుకుంటున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే, ఈ బియ్యంలో చాలా వరకూ మాఫియా చేతుల్లోకి వెళుతున్నాయి. గతంలో ఇళ్ల వద్దకు వచ్చి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసుకొని తీసుకెళ్లేవారు. కానీ ఇప్పుడు ఏకంగా రేషన్ దుకాణాల వద్దనే బేరం జరుగుతోంది. రేషన్ పంపిణీ చేసే వ్యక్తులే.. మీకు బియ్యం కావాలా..? డబ్బులు కావాలా..? అని అడుగుతున్నారు. డబ్బులు కావాలని చెబితే కిలోకు రూ.15 చొప్పున ఇచ్చేసి బియ్యం ఆపేస్తున్నారు. అయితే తాజాగా ఐవీఆర్ఎస్ సర్వేలో కొందరు కార్డుదారులకు సరుకులు ఇవ్వకనే ఇచ్చినట్లుగా నమోదు చేస్తున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో రేషన్ దుకాణాల్లో తనిఖీలకు ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం మేరకు జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ గత వారం పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. రేషన్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి తనకు నివేదిక అందజేయాలని జేసీ ఆదేశించారు.

● ఇకనైనా దృష్టి పెడతారా!?

రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బియ్యం పక్కదారి పడుతున్న జిల్లాల్లో నెల్లూరు కూడా ముందు వరుసలో ఉందన్నది నిఘా వర్గాల సమాచారం. ఇక్కడ రేషన్ బియ్యాన్ని తరలించి, రీసైక్లింగ్ చేసి మళ్లీ మార్కెట్లో తీసుకొచ్చే వ్యక్తులు.. అలానే ఇతర దేశాలకు ఎగుమతులు చేసే వ్యక్తులు ఒక మాఫియాగా ఏర్పాటై ఉన్నారన్నది బహిరంగ రహస్యం. ప్రతి నెలా రెండు వేల టన్నుల వరకూ రేషన్ బియ్యాన్ని పక్కదాని పట్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకుగానూ సంబంధిత శాఖలకు మామూళ్లు కడుతున్నట్లు మాఫియా బహిరంగంగా చెప్పుకుంటోంది. గుడిపల్లిపాడు, అల్లీపురం కేంద్రాలుగా ఉన్న కొన్ని మిల్లుల్లో నిరంతరం రేషన్ బియ్యం రీసైక్లింగ్ ప్రక్రియ జరుగుతోంది. కానీ అటువైపు ఏ అధికారీ కన్నెత్తి చూడరన్న విమర్శలు ఉన్నాయి. అయితే ఇప్పుడు ప్రభుత్వమే ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించి జిల్లా అధికారులను అప్రమత్తం చేసింది. మరి ఇకనైనా రేషన్ మాఫియాపై దృష్టి పెడతారో.. లేదో.. చూడాలి.



తనిఖీలు నిర్వహించమన్నారు

రేషన్ పంపిణీపై లబ్ధిదారుల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించిన మాట వాస్తవమే. ఇందులో కొంత మంది లబ్ధిదారులు సరుకులు తీసుకోలేదని చెప్పారు. ఈ అంశంపై జాయింట్ కలెక్టర్ మీటింగ్ పెట్టి, రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నివేదిక ఇవ్వమని ఆదేశించారు.

- విజయ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

నేడు బుచ్చి మండల సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి నారాయణరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల పరిషత్ ప్రాదేశిక, నియోజకవర్గ సభ్యులు, సర్పంచులు, అన్ని ప్రభుత్వ విభాగాల గ్రామ, మండల, డివిజినల్ స్థాయి అధికారులందరూ హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9488
వెండి కిలో ధర	రూ. 118100
వెండి ఒక గ్రాము	రూ. 121.10



ముందు జాగ్రత్తలతోనే సీజనల్ వ్యాధుల నివారణ

డాక్టర్ ప్రవల్లిక

వెంకటాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లయితే వ్యాధులను నివారించవచ్చని కసుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ ప్రవల్లిక సూచించారు.

?.. సీజనల్ వ్యాధులు ఎలా వ్యాపిస్తాయి.

!... తాగునీరు కలుషితం కావడం వల్ల జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులతోపాటు విష జ్వరాలు ప్రబలుతాయి. కాచి చల్లార్చిన లేదా క్లోరినేషన్ చేసిన నీటి ని తాగాలి. వేడి ఆహార పదార్థాలే తినాలి. ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకో వాలి. కనీస జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల ను అరికట్టవచ్చు.

?.. దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారా.

!... వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ సిబ్బంది సంయుక్తంగా దోమల నివారణకు చర్యలు చేపడుతున్నాం. దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

?.. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారా.

!... వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో 'ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నాం. మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

?.. సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

!... పరిసరాల్లోని నీటి గుంతలు, డ్రైనేజీ నీటిలో లార్వా చేరకుండా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నాం. శానిటేషన్ కార్యక్రమాలు చేపడుతున్నాం. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

నిధులున్నాయ్..నిర్మాణాల ఊసేదీ?

గుడపల్లి కాలువ ఆధునికీకరణ పనుల ప్రారంభం ఎప్పుడు?

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వెనక్కెళ్లిన నిధులు

నుడా నుంచి రూ. 40.36 లక్షల మంజూరు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఏవైనా పనులు చేపట్టాలంటే ఎక్కడైనా నిధుల కోసం నిరీక్షించడం సహజం. కానీ ఇక్కడ మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇప్పుడిక్కడ నిర్మాణ పనుల కోసం నిధులే ఎదురుచూస్తుండడం గమనార్హం. బుచ్చిరెడ్డిపాళెంలోని బైపాస్‌రోడ్డు నుంచి శేషాద్రినగర్ వరకు గుడపల్లి ఆధునికీ కరణ పనుల కోసం నుడా నుంచి రూ. 40.36 లక్షలు మంజూరయ్యాయి. అయినా నేటికీ నిర్మాణ పనులు చేపట్ట లేదు. కాలువ వెంబడి ఓ వైపు కరకట్టపైన నివసించే కుటుంబాలవారు రోడ్డుపైకి రావాలంటే ఆ కాలువ దాటా ల్సి వుంది. దానికోసం కర్రలు, బండలు ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఆ తరహాలోనే తాగునీటి సరఫరా పైపులు ఏర్పాటు చేసుకుని కాలం గడుపుతున్నారు. అక్కడి పిల్లలు స్కూలుకెళ్ళాన్నా.. పెద్దలు ఏ పనులకైనా వెళ్ళాలన్నా ఆ కాలువదాటి రోడ్డు పైకి రావాల్సిందే. ఈ పరిస్థితిలో చిన్నారులు కాలువ దాటే సమయంలో ఎక్కడ ప్రమాదాలకు గురవుతారోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా గుడపల్లి కాలువపై బైపాస్‌రోడ్డు నుంచీ శేషాద్రినగర్ వరకు రూ. 40.36 లక్షలతో ప్రహరీ, పైన బండల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు నగర పంచాయతీ కమిషనర్ తెలిపారు. నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు.





గుడపల్లి కాలువ దుస్థితి, రోడ్డుమీదకొచ్చేందుకు కర్రలు దాటుతున్న చిన్నారి

'నువ్వే మా నమ్మకం జగన్' స్టిక్కర్లు అటించ నివ్వలేదనీ...

గత ప్రభుత్వంలో కాలువ ఆధునికీకరణకు నుడా నిధులు మంజూరయ్యాయి. నిర్మిస్తామని కూడా అప్పట్లో చెప్పారు. అయితే అప్పట్లో 'నువ్వే మా నమ్మకం జగన్ స్టిక్కర్లు అంటించేందుకు వెళ్ళిన వైసీపీ కార్యకర్తలను అంటించొద్దని పలువురు అడ్డుకున్నారు. దీంతో ఆ కాలువ ఆధునికీకరణ పనులను గాలికొది లేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



35 ఏళ్ళుగా మురుగునీటి లోనే...

కాలువ వెంబడి 35 ఏళ్ళుగా మురుగునీటి దుర్గంధంలోనే బతుకు తున్నాం. ఎన్నికల్లో ఏవేవో చెప్పి వెళ్లారు. ఆ తరువాత గాలికొదిలేస్తారు. గత ప్రభుత్వంలో నిధులు వచ్చాయి, నిర్మించకుండా వదిలే శారు. నిధులు కూడా వెనక్కి వెళ్ళిపోయాయి. పాములు, దోమల బెడదతో నిత్యం నరకం అనుభవిస్తున్నాం.

- కుసుమ, భగత్‌సింగ్ కాలనీ

అన్నం కూడా తినలేకున్నాం



మేం 20 ఏళ్లుగా కాపురముంటున్నాం. దుర్గంధం మరీ ఎక్కువైంది. కనీసం అన్నం కూడా తినలేని పరిస్థితి. పిల్లలు కాలువ దాటుతుంటే ఎక్కడ పడిపోతారోనని భయమేస్తుంది. ప్రశాంతమ్మ కాలువ పైన గోడలు కట్టి బండలు వేయిస్తామని చెప్పారు.

- బి. రమణమ్మ, భగత్‌సింగ్ కాలనీ

పార్లపల్లి భూ రీసర్వే సమస్య పరిష్కరించాం

● ఎమ్మెల్యే సోమిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రమోహన్‌రెడ్డి

పొదలకూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో లోపభూయిష్టంగా జరిగిన భూ రీసర్వేలో భాగంగా పార్లపల్లిలోని సర్వేనెంబరు 445లో 760 ఎకరాలు 22ఏ నిషేధిత భూములుగా నమోదయ్యాయని, అ ప్పటి నుంచి ఉన్న సమస్యను పరిష్కరించా మ ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పార్లపల్లి గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా సర్వేపల్లి సమన్వయ కర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆయన భార్య శృతిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. అసంపూర్తిగా ఉ న్న దక్షిణ కాలువను పూర్తి చేస్తామని, కండలేరు ఎడమ కాలువ కింద 18ఆర్‌ను కూడా మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో పార్లపల్లి సర్పంచ్ గూడూరు ప్రసన్న, ఉపసర్పంచ్ అన్నలూరు చెన్న కృష్ణ మనాయుడు, టీడీపీ తెలుగు యువత మండ లాధ్యక్షుడు వెన్న పూస రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు గూడూరు శ్రీనివాసులు, తలచీరు మస్తాన్ బాబు, బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, కలిచేటటి ప్రభాకర్‌రెడ్డి, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, ఆదాల సుగు ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 40 కుటుంబాలు...

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

'నీటి వనరుల గణన' ప్రారంభం

వెంకటాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన 7వ చిన్న తరహా నీటి వనరుల గణన కార్యక్రమాన్ని మండలంలో ప్రారంభించామని తహసీల్దార్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామంలో చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్ లు, బోర్లు, బావులు, తవ్వకపు బావుల వివ రాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమో దు చేస్తామన్నారు. ఆగస్టు 15లోపు ఈ గణ నను పూర్తి చేయాలన్నారు.

లోకోస్ యాప్‌తో ఆన్‌లైన్‌లో సంఘాల వివరాలు

మనుబోలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఇకనుంచి స్వయం సహాయక సంఘాల వివరాలన్నీ లోకోస్ యాప్‌లో అనుసంధానం చేయడంపై స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వీవోఏలు, సీసీలకు శిక్షణ ఇచ్చారు. ఈఎంటీలు విను, భూషణ్‌లు సెల్‌ఫోన్‌లో యాప్‌లో వాటిని అనుసంధానం ఎలా చేయాలనే అంశంపై అవగాహన కల్పించారు.



శిక్షణ ఇస్తున్న ఈఎంటీలు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవతి

కోవూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతాంగం ప్రకృతి వ్యవసాయంపై దృష్టిని పెట్టాల్సిందిగా జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవతి రైతుల్ని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. నవధాన్యాల సాగుతో భూమి సారవంతమౌతుందన్నారు. ఏడాది పొడవునా జీవవైవిధ్య రకాల పంటలను సాగుచేయాలన్నారు. నవధాన్యాల సాగు కోసం వంగడాల్ని ఉచితంగా సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిత, డీపీఎం మణిరత్నం, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ మీరాబి, వ్యవసాయాధికారులు రజని, శ్రీహరి, లక్ష్మి, కోవూరు డివిజన్ గ్రామ సహాయ సంచాలకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలలో మోదీ చిత్రపటాలు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బుచ్చి అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి కళ్యాణ్ ఆధ్వర్యంలో బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని పలు కార్యాలయాల్లో గురువారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాలను ఏర్పాటు చేయించారు. తహసీల్దారు కార్యాలయం, నగర పంచాయతీ కార్యాలయం, వవ్వేరు, కట్టుబడిపాళెం, బుచ్చి పెద్దూరు, రామకృష్ణానగర్ సచివాలయాల్లో మోదీ చిత్రపటాలు ఏర్పాటు చేయించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే. ఖాదర్ బాషా, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు, గోళ్ళ నరసింహులు, మోర్చా నాయకులు లక్ష్మయ్య, రమణమ్మ, రమణయ్య, శీనయ్య, శాలినిరాణి తదితరులు పాల్గొన్నారు.



మోదీ ఫొటో ఏర్పాటు చేయిస్తున్న నాయకులు

● బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీలో ప్రజలకు తాగునీరు, వీధి దీపాల సౌకర్యం కల్పించాలని బీజేపీ అర్బన్ అధ్యక్షుడు కళ్యాణ్ పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజకు గురువారం వినతిపత్రం అందజేశారు. గత 6 నెలలుగా కొత్త వీధి దీపాలు లేక పంచాయతీలోని పలు ప్రాంతాల్లో అంధకారం అలముకొందన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పిలుపునిచ్చారు. గురువారం బుచ్చి నగర పంచాయతీలోని పార్కుసెంటర్ వద్ద మెప్మా సీఓ నర్మద ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా మార్కెట్‌ను చైర్‌పర్సన్ సందర్శించారు. పొదుపు మహిళలు స్వయంగా తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేశారు. పొదుపు సంఘాల ద్వారా రుణాలు తీసుకుని వ్యాపారాలు చేసుకుంటూ స్వయంశక్తితో ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వైష్ణవి, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రావణమాస పూజలు

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం 10గంటలకు లక్ష కుంకుమార్చన నిర్వ హించనున్నట్లు తెలిపారు. 29న మొదటి మంగళవారం ఉదయం కాత్యాయనీ వ్రతం నిర్వహిస్తామన్నారు.

శ్రీబాల చౌడేశ్వరిదేవి జయంత్యుత్సవం

పొదలకూరు : స్థానిక తొగటవీధిలోని శ్రీబాల చౌడేశ్వరి దేవి ఆలయంలో తొగట వీర క్షత్రియుల ఆధ్వర్యం లో శ్రీబాల చౌడేశ్వరి దేవి జయంత్యుత్సవాలు గురువారం నిర్వహించారు. అమ్మ వారికి పొంగళ్లు, బుట్టలు, సారెను సంప్ర దాయబద్ధంగా సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోవిందు, శ్రీనివాసులు, పూసా వెంకటేశ్వర్లు, కొండయ్య, బత్తూరి కృష్ణ, చినకొండయ్య పాల్గొన్నారు.

కోవూరు 'షుగర్స్' హామీలు నెరవేర్చాలి

కోవూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): చెరకు రైతులకు, కోవూరు చక్కెర కర్మాగార కార్మికులకు యిచ్చిన హామీలను నెరవేర్చాలని చెరుకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గండవరపు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీతా పోలయ్య భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పరిశ్రమల శాఖామంత్రి టీజీ భరత్ పోతిరెడ్డిపాళెంలో రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు కోర్టు స్టే అడ్డంకిగా మారిందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు రఘురామయ్య, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకమరాజు, నాయకులు బాబు, బుజ్జయ్య పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన జగన్

● వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ



కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

సైదాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా జగన్మోహన్ రెడ్డి అప్పులపాలు చేశా డని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని తురిమెర్ల గ్రామంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నియోజక వర్గ పరిశీలకుడు జెన్ని రమణయ్య, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి పెమ్మసాని దిలీప్ చౌదరి, మాజీ సర్పంచు అమ్మినేని సుబ్రహ్మణ్యంనాయుడు, నాయకులు మేడికొండ రమణయ్య నాయుడు, కర్నం శ్రీనివాసులు నాయుడు, దర్శి వెంకటేశ్వరరావు, పొట్టేళ్ళ అశోక్ యాదవ్, అంకి శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి వెంకటరమణయ్య జయంతి

రాపూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కండలేరు నీటిమట్టం 27.880 టీఎంసీలు

రాపూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తిస్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 27.880 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో ఏమీ లేకపోగా అవుట్‌ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 2160 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ నుంచి 100, హైలెవల్ కెనాల్ నుంచి 10 క్యూసెక్కులు మొత్తం 2270 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో ఉందన్నారు.

నిడిగుంటపాళెంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

వెంకటాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నిడిగుంట పాళెంలో గురువారం తెలు గు రైతు రాష్ట్ర ప్రధాన కార్య దర్శి, చవటపాళెం సొసైటీ అధ్యక్షుడు రావూరి రాధాకృష్ణమనాయుడు ఆధ్వర్యంలో 'సుపరి పాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ సీనియర్ నేత రావూరి పద్మనాభ నాయుడు, బూత్ ఇన్‌చార్జ్‌లు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు

ముత్తుకూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాలయోగి గురుకుల బాలికల కళాశాలలో ఆర్వో ప్లాంట్‌కు గురువారం మరమ్మతులు చేశారు. పది రోజులుగా ఆర్వో ప్లాంట్ పనిచేయక పోవడంతో విద్యార్థినులు ఇబ్బందులుపడ్డారు. కళాశాలలో పరిస్థితిని స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్ గురువారం కళాశాలను పరిశీలించారు. ముత్తుకూరు పంచాయతీ సిబ్బంది సహకారంతో మరమ్మతులు చేయించి విద్యార్థులకు తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు.

ఎల్‌పీఎంల సబ్ డివిజన్ ఇక ఉచితం

మనుబోలు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు జాయింట్ ఎల్‌పీఎంలను విడగొట్టాలంటూ సచివాలయాల్లో చలానాలు కట్టాల్సి వచ్చేదని, ఇకపై చలానాల అవసరం లేకుండా ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

'హరిహరవీరమల్లు' విజయోత్సవాలు

మనుబోలు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మనుబోలులో గురువారం రాత్రి జనసైనికులు హరిహర వీరమల్లు చిత్రం విజయోత్సవ సంబరాలు జరుపుకొన్నారు. స్థానిక ఆటో సెంటర్ వద్ద బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పెనుబాక మహేష్, జాకీర్, ఖాదర్‌వల్లీ, సురేష్, ఉదయ్, కిరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌లో అపరిచిత లింకులను క్లిక్ చేయొద్దు

విడవలూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌లలో వచ్చే అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దని ఎస్‌ఐ నరేష్ కుమార్ యాదవ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం గంజాయి, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గంజా యికి బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దీనదయాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఫోర్జరీ సంతకాల కేసులో మాజీ మంత్రి కాకాణికి రిమాండ్

నెల్లూరు (లీగల్), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ భూముల స్వాహా కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి వచ్చే నెల 7వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపుతూ నెల్లూరు నగర మొదటి తరగతి రెండవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శారదారెడ్డి గురువారం ఉత్తర్వు చేశారు. మోసం, దగా, కుట్రలతో వెంకటాచలం తహసీల్దారు కార్యాలయంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి రికార్డులను తారుమారు చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారన్న కేసులో కాకాణి 14వ నిందితుడిగా ఉన్నారు. తొలుత జిల్లా జైలులో ఉన్న కాకాణిని వర్చువల్ విధానంలో పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరు పరిచారు. ఇరువైపులా వాదనలు విన్నాక న్యాయమూర్తి కాకాణిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపుతూ ఉత్తర్వు చేశారు.

బస్సు చక్రాల కింద నలిగిన ప్రాణం

నెల్లూరు(క్రైం), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. సుమారు 55 ఏళ్ల వ్యక్తి బుధవారం రాత్రి నెల్లూరులో మినీబైపాస్‌లోని మిలీనియం సబ్‌స్టేషన్ వద్ద ఉన్నాడు. ఆత్మకూరు బస్టాండు వైపు నుంచి వచ్చిన బస్సు యూటర్న్ తీసుకునే సమయంలో ఆ వ్యక్తిని ఢీకొనడంతో కిందపడ్డాడు. బస్సు వెనుక చక్రం అతని నడుముపైకి ఎక్కడంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇది గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 సాయంతో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ పోలీసులు వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విషం తాగి వ్యక్తి మృతి

వెంకటాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇస్కపాళెంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శ్రీనివాసులు అనే వ్యక్తి విషం తాగాడు. నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు మృతుడి కుమారుడు ఎస్ మహేష్ తెలిపాడు. తండ్రి శ్రీనివాసులు గత పదేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతుండేవాడని, వ్యక్తిగత పనులు కూడా చేసుకోలేకపోయేవాడన్నారు. ఆ బాధతోనే విషం తాగాడని, దీంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి మహిళకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విబూది పుల్లమ్మ

కలువాయి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని తోపుగుంట సమీపంలో గురువారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. వెంకటరెడ్డిపల్లి జంగాల కాలనీకి చెందిన విబూది పుల్లమ్మ ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుని ఆదూరుపల్లి నుంచి తిరిగి ఇంటికి ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చొని వస్తోంది. తోపుగుంట సమీపంలోకి వచ్చేసరికి ఆటోనుంచి పుల్లమ్మ తూలి పడిపోతుండగా డ్రైవర్ ఆమెను పట్టుకునే ప్రయత్నంలో ఆటో అదుపుతప్పడంతో వారు కింద పడ్డారు. వారిపై ఆటో పడడంతో పుల్లమ్మకు తీవ్ర గాయం కావడంతో కలువాయి పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్యం అనంతరం నెల్లూరుకు తరలించారు.

బస్సు చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూలై 24 (ఆంధ్రజ్యోతి): బస్సు చోరీ చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.... నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండులో ఉన్న ఆత్మకూరు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సును బుధవారం తెల్లవారుజామున విడవలూరు మండ లం కంచరపాలెం గ్రామానికి చెందిన బిట్రగుంట కృష్ణ అపహరించుకు వెళ్లారు. డిపో మేనేజర్ శివకేశవ యాదవ్ ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం అర్ధరాత్రి నిందితుడిని అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరు పరిచామని పోలీసులు తెలిపారు. అయితే నిందితునికి మతిస్థిమితం లేనట్లు పోలీసులు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

● మూడు బైకుల స్వాధీనం

కావలి రూరల్, జూలై24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మోటారు బైక్‌లను చోరీచేసి, వాటిని కుదువ పెడుతున్న ఇద్దరు నిందితులను గురువారం అరెస్ట్ చేసినట్లు ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు, ఇటీవల పట్టణంలోని రైల్వే స్టేషన్ దగ్గర పార్కుచేసిన రెండు బైకులు, యానాదిరెడ్డి వీధిలో ఇంటి ముందు ఉంచిన ఓ బైక్‌ను నిందితులు చోరీచేశారు. వాటిని కుదువపెట్టే ప్రయత్నంచేశారు. అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ సుమన్, సిబ్బంది గాయత్రీ నగర్‌కు చెందిన ఎస్‌కె సుభానీ, అరుంధతీయపాలెంకు చెందిన దావులూరి సృజన్‌ను నిందితులుగా గుర్తించి, వారి వద్ద నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కావలి కాలువ వంతెన రక్షణ గోడలు శిథిలం


● పొంచి ఉన్న ప్రమాదం



శిథిలమైన కావలి కాలువ వంతెన రక్షణ గోడలు

సంగం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరుపాడు వద్ద కావలి కాలువ వంతెన రక్షణ గోడలు శిథిలమై ప్రమాదకరంగా మారింది. గ్రామానికి చెందిన 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రతిరోజు ఈ వంతెన మీదనే రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో కొంతమంది విద్యార్థులు సైకిల్‌పైన, మరికొంత మంది విద్యార్థులు నడిచి వెళతారు. సుమారు పది అడుగుల లోతు ఉండే రక్షణ గోడలులేని కాలువ వంతెనపై ప్రయాణం చేసే విద్యార్థులకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా బద్వేల్ రోడ్డు



ముళ్లపొదలతో మూసుకుపోయిన రోడ్డు

అనంతసాగరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అనంతసాగరం నుంచి బద్వేల్‌కు వెళ్లే ప్రధాన రహదారి గౌరవరం ఉత్తర కాలువ సమీపంలో రోడ్డు ముళ్లపొదలతో మూసుకొని ప్రమాకరంగా మారింది. దీంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి ముళ్లపొదలను తొలగించి ప్రమాదాలు నివారించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 475


లస్సీసెంటర్‌లో..


ఆచారి వీధిలో..

వీధుల నిండా వ్యర్థాలు!

నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికుల ఆందోళనతో నగర వీధుల్లో శుభ్రత కరువైంది. ఏరోజుకారోజు చెత్తను తొలగించకపోవడంతో పలు ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. నిత్యం జనరద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రోడ్లపై చెత్త కుప్పలు పెరిగిపోవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. దుర్గంధం వ్యాపిస్తోంది. దీనికితోడు కుక్కలు, పశువులు ఆ చెత్తకుప్పల నుంచి వ్యర్థాలను లాక్కుని వస్తుండటంతో చెత్త రోడ్లపై పరుచుకుంటోంది. దీనివల్ల పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. కొన్నిచోట్ల చెత్త కుండీలు నిండిపోవడంతో వాటి పక్కన, రోడ్లపైనే వ్యర్థాలను పోస్తున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్


కొరడా వీధిలో..


చిన్న బజారులో..


ఎంపీ అగ్రహారంలో..



దేవీ నారాయణీ నమోస్తుతే..

● నేటి నుంచి శ్రావణమాసం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : సకల శుభాలకు, నూతన కార్యక్రమాల ప్రారంభానికి మేలైనదిగా చెప్పుకునే శ్రావణ మాసం శుక్రవారం మొదలవుతోంది. జిల్లాలోని ఆలయాలు శ్రావణమాస వేడుకలకు సిద్ధమయ్యాయి. అన్నీ ఆలయాల్లో ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు.

● నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఈ మాసంలో ప్రతీ శుక్రవారం సామూహిక లక్ష కుంకుమార్చన ఉదయం 9గంటలకు జరుగుతుంది.

● గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో సాయంత్రం 7గంటలకు సామూహిక కుంకుమార్చన, మూలవర్లకు చందనాలంకారం, పూలంగిసేవ, రాత్రి పల్లకీసేవ జరగనున్నాయి.

● మూలాపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, సాయంత్రం పూలంగిసేవ, రాత్రి పల్లకీసేవ ఉత్సవాలు జరుగుతాయి. అలాగే స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ ఉత్సవాలు జరగనున్నాయి.

సీసీరోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన

నెల్లూరు రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి) : నగరంలోని 12వ డివిజన్ నార్తరాజుపాళెంలో రూ23 లక్షలతో చేపట్టబోతున్న సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మా ణాలకు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. రూరల్ నియోజకవర్గానికి నిధుల కేటాయింపు లో సీఎం చంద్రబాబు చేయూతను మరువలే మన్నారు. అనంతరం కందమూరు, ఉప్పుటూ రు గ్రామాల్లో తహసీల్దారు కృష్ణప్రసాద్, ఎం పీపీ విజయకుమార్‌తో కలిసి రెవెన్యూ సద స్సుల్లో పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమపిత వెంకట రమణయ్యకు నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమ పిత అయ్యంకి వెంకట రమణయ్య జయంతిని గురువారం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ఆయనకు అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ పునర్వికాస వేదిక కన్వీనర్ డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య ఈ సందర్భంగా వెంకట రమణయ్య చిత్రపటాన్ని గ్రంథాలయానికి బహూకరించారు. పునర్వికాస వేదిక సభ్యుడు బొగ్గవరపు శ్రీమన్నారాయణ, గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే ఇవ్వాలి : ఎస్‌డబ్ల్యూఎఫ్

ఆత్మకూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ బస్సు ల నిర్వహణ ఆర్టీసీ సంస్థకే ఇవ్వాలని, ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ సంస్థలకు కేటాయించ వద్దని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో రా ష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురు వారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షుడు మహ్మదాలీ, రీజనల్ బాధ్యులు యు నరసింహులు మాట్లాడుతూ విజయవాడ గవర్నర్‌పేట-2 డిపో, విజయవాడ పాత బస్టాండ్ స్థలాలను బహుళజాతి సంస్థ లూలూ షాపింగ్‌మాల్‌కు ఇచ్చే ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల భవిష్యత్తు రవాణా అవసరాలకు ఉపయోగపడే ఆర్టీసీ స్థలాలు అన్యాకాంతం కాకుండా కాపాడాల్సిన ప్రభుత్వమే ఇలాంటి చర్యలకు పూనుకోవడం బాధాకారమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి ఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు వెంగమాంబ హుండీల లెక్కింపు

దుత్తలూరు (ఉదయగిరి) : నర్రవాడలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయంలో హుండీల లెక్కింపు శుక్రవారం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేవదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల సమక్షంలో హుండీల లెక్కింపు జరుగుతుందని ఆయన తెలిపారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

నెల్లూరు (వైద్యం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యాధికారులు నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. ఏడీఎం హెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, వెంకటాచలం ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ వేదవల్లి వాణిశ్రీ, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నరసింహులు, సరోగసి చట్ట అమలు రాష్ట్ర బోర్డు సభ్యురాలు కవితారెడ్డి తదితరులు నగరంలోని లోటస్, అండాల్, సరయు ఆసుపత్రుల్లోని స్కానింగ్ కేంద్రాలతోపాటు ఇమేజ్ స్కానింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏడీఎంహెచ్‌వో మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ నియమాలను స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఫామ్-4ను ప్రతినెల మొదటి వారంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ విజయ కుమార్, పబ్లిక్ ప్రైవేట్ కో ఆర్డినేటర్ హరీష్, భవ్య, ఆర్గనైజేషన్ ఫీల్డ్ కో ఆర్డినేటర్ సరిత పాల్గొన్నారు.


స్కానింగ్ కేంద్రాల తనిఖీలో వైద్యాధికారులు

వృద్ధాప్య పింఛన్ల పంపిణీ

నెల్లూరు (వైద్యం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఆర్య వైశ్య బులియన్ మర్చంట్స్, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వృద్ధాప్య పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. నెల్లూరు రంగనాయకుల పేట అసోసియేషన్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు హాజరై పింఛన్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ సభ్యుల సమస్యలను మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫణీంద్ర కుమార్, కోశాధికారి భోగనాథం సుబ్రహ్మణ్యం, అయితా సుబ్బరాయుడు పాల్గొన్నారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న సుబ్బారావు, అసోసియేషన్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు

27 నుంచి వడ్డెరల రాష్ట్ర మహాసభలు

నెల్లూరు (వైద్యం) జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలు ఈ నెల 27, 28 తేదీల్లో నెల్లూరులో జరుగుతాయని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ తెలిపారు. ఈ సభలకు సంబంధించి ఆటోల ద్వారా ప్రచారాన్ని గురువారం నగరంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం వద్ద జెండాఊపి ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో వడ్డెరలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. వడ్డెరల కోసం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ వంటి రక్షణ చట్టాన్ని ప్రభుత్వం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోటకొండ వెంకటేష్, నాయకులు బత్తల రమణయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


ఆటోలకు జెండా ఊపి ప్రచారాన్ని ప్రారంభిస్తున్న గుంజి దయాకర్

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

నెల్లూరు(విద్య), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎస్టీయూ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. యూనియన్ నాయకులు ఉపాధ్యాయులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మునిసిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, ఖాళీలు భర్తీ చేసేలా అధికారుల తో చర్చిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే నరసింహం, నాయకులు జీ రాజమనోహర్, ఎన్ వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బయ్య, లక్ష్మయ్య, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్టీయూ నాయకులు

వార్డు సభల్లో పీ-4 లబ్ధిదారుల ఎంపిక

● నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), జూలై 24(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, దాతల సహకారంతో నిరుపేద కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు చేపట్టిన పీ-4 కార్యక్రమానికి లబ్ధిదారులను వార్డు సభల ద్వారా ఎంపిక చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ అధికారులకు సూచించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వార్డు సభలు నిర్వహించి.. ఆర్థిక, మౌలిక సదుపాయాలను పరిగణలోకి తీసుకుని పేద, నిరుపేద కుటుంబాలను గుర్తించాలన్నారు. ఇలా గుర్తించిన వారందరి వివరాలు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఎంపికైన కుటుంబాలకు దాతల సహకారంతో ఆర్థిక చేయూత నందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అమృత్ పథకం డీడీ మాధురి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నందన్, పక్కన అమృత్ పథకం డీడీ మాధురి

నేడు న్యాయవాదుల నిరసన

నెల్లూరు (లీగల్), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఐఏఎల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయమూర్తుల పదవులను వెంటనే భర్తీ చేయాలని, న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన తెలుపుతున్నామని, న్యాయవాదులు అందరూ పాల్గొనాలని కోరారు.

న్యాయం చేయండి : డీఎస్వోకు ట్రాన్స్‌పోర్టర్ల వినతి

నెల్లూరు (హరనాథపురం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : తమకు న్యాయం చేయాలని బీపీసీఎల్ కృష్ణపట్నం ఇన్‌స్టలేషన్‌లో పనిచేస్తున్న ట్రాన్స్‌పోర్టర్లు అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విజయ్ కుమార్‌కు గణేష్ లెమన్ ట్రేడర్స్ అధినేత ఏ మస్తాన్ నాయుడు వినతిపత్రం ఇచ్చారు. బీపీసీఎల్ డిపోలో సిబ్బంది బెదిరింపులు, అవినీతి కార్యకలాపాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని తెలిపారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. బొగ్గు, ధూళి, పాడైన రహదారులు, అత్యంత తక్కువ రవాణా ధరల ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయామని తెలిపారు. అయినా ఇంధన సరఫరా సేవలు కొనసాగిస్తున్నామని, బెదిరింపులు అధికమైతే లారీలను నిలిపి వేస్తామని స్పష్టం చేశారు.


డీఎస్‌వో విజయకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న మస్తాన్ నాయుడు

ఆటో మ్యుటేషన్‌పై అవగాహన

నెల్లూరు (హరనాథపురం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ శాఖలో అర్బన్ ఇళ్లకు ఆటో మ్యుటేషన్ గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలలో ఇళ్లకు సంబంధించి ఆటో మ్యుటేషన్ ప్రక్రియ త్వరలో ప్రారంభంకానున్న దృష్ట్యా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ విజయరాణి, సబ్‌రిజిస్ట్రార్లు సింహాద్రి నాయుడు, ప్రవీణ, భానుమతి, సుమలతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ విజయరాణి, తదితరులు

ఆయిల్‌పామ్ అభివృద్ధికి 25 మండలాల ఎంపిక

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టడానికి గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 25 మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈమేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయిల్‌పామ్ జాతీయ మిషన్ కింద 25 మండలాలను ఆయిల్‌పామ్ అభివృద్ధి సంస్థలకు కేటాయించనున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జాతీయ వంట నూనెల మిషన్ 2025-26 పథకాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహిందుకు రాష్ట్ర నూనెగింజల మిషన్ అనే రాష్ట్రస్థాయి కమిటీని ప్రభుత్వం నియమించింది. కేంద్రం మార్గదర్శకాల ప్రకారం ఈ మిషన్ 2024-25 నుంచి 2030-31 వరకు పని చేస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఉండే ఈ కమిటీలో వివిధ శాఖల అధికారులు, అభ్యుదయ రైతులు, రైతు ఉత్పత్తి సంఘాల ప్రతినిధులు, నూనె గింజల వ్యాపారులను సభ్యులుగా నియమించారు.

'నరసింహకొండ'కు ఎక్స్‌పర్ట్ అవార్డు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్‌లోని పుణ్యక్షేత్రం నరసింహులకొండ చిత్రానికి ఆర్ట్ ఎక్స్‌పర్ట్ అవార్డు లభించింది. రాజమండ్రి భగీరథ ఆర్ట్ ఫౌండేషన్ సంస్థ ప్రముఖ చిత్రకారు డు భగీరథ 125వ జయంతి సందర్భంగా చిత్రకళా పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో నగరానికి చెందిన డాక్టర్ అమీర్‌జాన్ గీసిన నరసింహకొండ చిత్రం అవార్డుకు ఎంపికైంది. ఈనెల 27న రాజమండ్రిలో జరిగే బహుమతి ప్రదానోత్సవంలో ఆయన అవార్డు అందుకుంటారు. అమీర్‌జాన్ 24/30 సైజులో అక్రిలిక్ పెయింట్స్‌తో నరసింహులకొండను చిత్రీకరించారు.


ఆర్ట్ ఎక్స్‌పర్ట్ అవార్డుకు ఎంపికైన అమీర్‌జాన్ గీసిన నరసింహకొండ చిత్రం

సీఎస్ఈకి జై...

(5వ పేజీ తరువాయి)

అయ్యాయి. అలాగే వీటీటీకే కళాశాలలో 1248 సీట్లకు 841, ఎస్వీసీఎన్ కళాశాలలో 2640 సీట్లకు 1020, డీఎస్ఐటీ కళాశాలలో 235 సీట్లకు 66, జీకేసీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో 432 సీట్లకు 116, పీఐఎస్ఎన్ కళాశాలలో 96 సీట్లకు 6, పీఆర్ఐకే కళాశాలలో 192 సీట్లు 9 సీట్లు భర్తీ అయ్యాయి. అయితే, వీటిలో కూడా సీట్లు అధికంగా భర్తీ అయిన కళాశాలలు ఆనందాన్ని వ్యక్తం చేస్తుండగా సీట్లు భర్తీ కాని కళాశాలల యాజమాన్యాలు మాత్రం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో త్వరలో తిరిగి రెండోసారి వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తే సీట్ల భర్తీ పెరిగే అవకాశం ఉందా లేదా అని వేచి చూడాల్సిందే.

● సీఎస్ఈకి తగ్గని క్రేజ్

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ)కు క్రేజ్ తగ్గనంటోంది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ప్రక్రియల్లో సమాచార వ్యవస్థల డిజైన్, అమలు, నిర్వహణకు సంబంధించిన కోర్సు కాబట్టి దీనికే ఎక్కువగా జై కొడుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిశ్రమల్లో అధునాతన వ్యవస్థలు, ఆటోమేషన్ పురోగతి సీఎస్ఈ రంగానికి డిమాండ్ పెంచింది. ఏఐ, బ్లాక్‌చెయిన్ వంటి అధునాతన టెక్నాలజీలు ప్రపంచ రూపురేఖలు మారుస్తుండటం, ప్రతి రంగంలో కంప్యూటర్ల వినియోగం ఉండడంతో సీఎస్ఈకి ఎంతో ప్రాధన్యత లభిస్తోంది. దీంతో పెద్ద కంపెనీల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొంది రూ.లక్షల్లో జీతాలు అందుకోవచ్చన్న ఆశతో విద్యార్థులు దీనికే మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో సీఎస్ఈలో 3972 సీట్లకు గాను తొలి విడతలో 2,672 సీట్లు భర్తీ అయ్యి ప్రథమస్థానంలో నిలవగా, ఈసీఈ, ఏఐఎంఎల్‌లు తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

త్రోబాల్‌లో నెల్లూరుకు తృతీయం

● ముగిసిన 25వ మహిళా గేమ్స్ మీట్

రాజానగరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): క్రీడలు దేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తాయని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పరిధిలోని మెడికల్, డెంటల్ కళాశాలల 25వ మహిళా గేమ్స్ మీట్ గురువారం ముగిసింది. బహుమతి ప్రదానోత్సవ సభకు రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ అన్ని రంగాల్లో ముందంజలో ఉందని చెప్పారు. ఈ పోటీలకు 24 కళాశాలల నుంచి 527 మంది విద్యార్థులు హాజరయ్యారు. త్రోబాల్ పోటీల్లో కోనసీమ మెడికల్ కళాశాల(అమలాపురం) విన్నర్‌గా, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల(రాజమహేంద్రవరం) రన్నర్‌గా నిలవగా, నారాయణ డెంటల్ కాలేజీ(నెల్లూరు), కోనసీమ డెంటల్ కాలేజీ(అమలాపురం) తృతీయ స్థానంలో నిలిచాయని స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ త్రిమూర్తి తెలిపారు.

ఎన్నాళ్లీ చెట్టు కింద సేవలు...!



చెట్టు కింద 104 వైద్యసేవలను ఏర్పాటు చేసిన వైద్యఆరోగ్య సిబ్బంది

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఓ చెట్టు కింద వైద్యఆరోగ్య సిబ్బంది 104 వైద్యసేవలను రోగులకు అందిస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన పాపం.. వారికి శాపంగా మారింది. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను అసంపూర్తిగా వదిలేయడంతో సిబ్బంది ఇలా రోగులకు చెట్లు, అరుగుల మీద వైద్యసేవలందిస్తున్నారు. ఆరుబయట వైద్యసేవలతో అటు రోగులు, ఇటు సిబ్బంది అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను పూర్తిచేసి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

పరిశ్రమలతో జిల్లా అభివృద్ధి

● ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నూతన పరి శ్రమల ఏర్పాటు జిల్లా అభివృద్ధికి తోడ్పడుతుందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 1700 దరఖాస్తులురాగా 1616 ఆమోదించినట్లు చెప్పారు. వివిధ కార ణాలతో 20 దరఖాస్తులు తిరస్కరించగా 64 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటినీ త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మోగా ప్రాజెక్టుల ద్వారా 13,599 మందికి, భారీ పరిశ్రమల ద్వారా 5,557 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో ఏర్పడుతున్న వివిధ పరిశ్రమల పురోగతిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, ఆర్డీవోలు పావని, అనూష, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

రూ. 2 లక్షలు కాజేసిన

సైబర్ నేరగాళ్లు

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రారెడ్డి పాలెంకి చెందిన ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.2 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన వెన్న పూస బసిరెడ్డి ఫోన్‌కు బుధవారం గుర్తు తెలియని నంబర్ నుంచి ఓటీపీ వచ్చింది. అయితే ఈ ఓటీపీని ఆయన బంధువు ఒకరు ఓపెన్ చేశారు.దీంతో బసిరెడ్డి సంబంధించిన మూడు బ్యాంకు ఖాతాల్లో రెండు ఖాతాల నుంచి రూ.2 లక్షలను సైబర్ నేరగాళ్లు కొట్టే శారని గురువారం ఉదయం గుర్తించాడు. అనంతరం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.అయితే వారి సూచన మేరకు బసిరెడ్డి గురువారం రాత్రి పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు.అలాగే ఆయన ఖాతాలున్న రెండు బ్యాంకులకు వెళ్లి జరిగిన విష యాన్ని బ్యాంకు అధికారులకు తెలిపి, ఆయన ఖాతాలను లాక్ చేయించాడు.

బత్తాయి.. బేల చూపులు

● దిగజారిన ధరలు, నిలిచిన ఎగుమతులు

● దిగుబడులు లేక పెట్టుబడులు రానివైనం

● నాడు కాసులు.. నేడు కన్నీళ్లు..!



ఉదయగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బత్తాయి తోటలతో కళకళలాడే ప్రాంతం ఉదయగిరి. ఏటా కాసులు కురిపించే ఈ తోటలు ప్రస్తుతం రైతులకు నష్టాలను మిగుల్చుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో చిత్తకాపు కాయ నాణ్యతను బట్టి టన్ను రూ.40వేల నుంచి 50 వేల వరకు పలికింది. ప్రస్తుత సీజన్ కాపు రూ.15 వేలు కూడా పలకడం గగనంగా మారింది. మంగు, రసం తగ్గిన కాయల కొనుగోలుకు వ్యాపారులు మక్కువ చూపడంలేదు. దీనికి తోడు దిగుబడి సైతం బాగా తగ్గిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు 5 నుంచి 6 టన్నుల కంటే దిగుబడి రావడంలేదు. గతంలో ఇతర రాష్ట్రాల వ్యాపారులు వచ్చి కాయలు చెట్లకు ఉన్నప్పుడే కొనుగోలు చేసేవారు. నేడు ఆ పరిస్థితి తల్లకిందులైంది. ఈ ధరలతో పెట్టిన పెట్టుబడులు కూడా రావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఆగిన ఎగుమతులు

కొన్నిరోజులుగా ఉత్తరాదిరాష్ట్రాలతోపాటు పలు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణం కూడా చల్లడింది. దీంతో ధరలు ఒక్కసారిగా దిగజా రాయి. ప్రతి ఏటా జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో బత్తాయి సీజన్ కాపు మొదలవుతోంది. ఇక్కడ కాయలు నాణ్యతగా ఉండటంతో దిగుబడంతా ఇతర ప్రాంతాల వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో తెలంగాణ, తమిళనాడు, బెంగళూరుతోపాట ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. అయితే ఆయా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో వ్యాపారులు ఇటువైపు కన్నెత్తి చూడడంలేదు. దీంతో ధరలు దిగజారి రైతులకు నష్టాలు తప్పడంలేదు.

● పెట్టుబడులు భారమై...

బత్తాయి సాగుకు పెట్టుబడులు అధికం. గతంలో ఉదయగిరి నియోజక వర్గంలో అన్నీ మండలాల్లో విస్తారంగా బత్తాయి సాగు ఉండేది. ప్రస్తుతం రెండు, మూడు మండలాలకే పరిమితమైంది. దీనికితోడు వేరుకుళ్లు, బంక, వైరస్ తెగుళ్ల అధికం కావడంతో వాటి నివారణకు రైతులు మందులు పిచికారి చేసేందుకు, దున్నకానికి, చెట్ల పాదులు చేసేందుకు కూలీలకు భారీగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అయితే మార్కెట్ లో గిట్టుబాటు ధర పలకకపోవడంతో రైతులకు పెట్టుబడులు కూడా కష్టమయ్యాయి.

● తగ్గిన దిగుబడులు

ఈ ఏడాది ధర లేకపోగా సీజన్ కాపు దిగుబడులు కూడా అంతంత మాత్రంగా ఉండడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ధర, దిగుబడి లేకపోవడంతో కూలీల ఖర్చులు, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి తోటలకు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టామని ధర లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.



లారీకి లోడ్ చేస్తున్న బత్తాయి కాయలు



సంగంలోని తంతి తపాలా కార్యాలయం

రిజిస్టర్ పోస్టు బుకింగ్ సులభతరం

ఇంటి నుంచే పంపే అవకాశం

తపాలా శాఖ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో సేవలు

రూ. 500 విలువ లోపైతే ఉచితం

సంగం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మారు తున్న కాలానికి అనుగుణంగా తపాలాశాఖ సేవలను విస్తరిస్తోంది. సొంతంగా రూపొందించుకున్న అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ ద్వారా గత రెండు రోజుల నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే బ్యాంకింగ్ సేవలకు ఏమాత్రం తీసిపోని రీతిలో పబ్లిక్ మొబైల్ బుకింగ్ సేవలను అమలు చేస్తోంది. ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా ఇంటి వద్ద నుంచే రిజిస్టర్ పోస్టు బుకింగ్ సేవలకు శ్రీకారం చుట్టిం ది. ఇందులో భాగంగా ఎవరైనా వినియోగదారుడు మొబైల్ యాప్‌లో పోస్టల్ సిబ్బందికి రిక్వెస్ట్ మెసేజ్ పంపాలి. తర్వాత తపాలాశాఖ నుం చి బార్‌కోడ్ నెంబరు, ఓటీపీ వస్తుంది. ఇంటి కొచ్చే పోస్టల్ ఉద్యోగి దగ్గర వీటిని సరిచూసుకొని రిజిస్టర్ పోస్టులేవైనా బుక్ చేసుకోవచ్చు. రూ. 500 లోపు విలువ చేసే వాటికి ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. రూ. 500 దాటితే నిర్ణీత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా వినియోగదారులు పోస్టాఫీసుకు వెళ్లి అక్కడ క్యూలో గంటల తరపడి వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. ఎటువంటి అదనపు రుసు ము వసూలు చేయకుండానే డోర్ స్టెప్ సేవలను తపాలాశాఖ అందిస్తోంది.

● వినియోగదారుల్లో హర్షం

తపాలా శాఖ మొబైల్ యాప్ ద్వారా ఇంటి నుంచే రిజిస్టర్ బుకింగ్ సేవలు అందుబాటులోకి తేవడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పోస్టల్ శాఖ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) మొబైల్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు ఏవైనా ఇంటి నుంచే పంపేందుకు రిజిస్టర్ పోస్టు బుకింగ్ సేవలు అందుబాటులోకి తేవడంతో మరింత ఉపయోగకరంగా ఉంటుందని వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందించాలి

● అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాధపురం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనుకబడిన ముస్లిం మైనార్టీలకు 15 శాతం తగ్గకుండా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో శాఖల వారీగా ముస్లిం మైనార్టీలకు అందించిన సంక్షేమం, అభివృద్ధి పథకాలపై సమీక్ష జరిపారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను మైనార్టీలకు చేరువ చేయాలని సూచించారు. నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడులోని ముస్లిం మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణం పూర్తి చేయడం, మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముస్లిం మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హైపా, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఈవో బాలాజీరావు, డ్వామా పీడీ గంగాభవానీ, సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

● హైవే, రైల్వే భూసేకరణ త్వరితగతిన చేపట్టాలి...

జిల్లాలో హైవే, రైల్వే అవసరాలకు భూసేకరణను త్వరితగతిన చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ బ్రాడ్ గేజ్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూమిని ఇచ్చిన వారికి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సూచించారు. బద్వేలు నుంచి నెల్లూరు వరకు ఫేస్ వన్, ఫేస్ టు కింద నేషనల్ హైవే ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ అంశంపై చర్చించారు. అవసరమైన చోట అటవీశాఖ అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కే కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్‌సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

మా ప్రాణాలు తీసి మైనింగ్ తవ్వుకోండి

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థులు వేడుకోలు

వరికుంట పాడు (ఉదయగిరి రూరల్), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : 'మా గ్రామంలో మైనింగ్ వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరించాల్సి వస్తే ముందుగా మా ప్రాణాలు తీసి పనులు ప్రారంభించేలా నిర్ణయం తీసుకోండి.' అంటూ జంగంరెడ్డిపల్లి గ్రామస్థులు అధికారుల ఎదుట తమ గోడు వినిపించారు. గురువారం గ్రామంలోని అటవీ ప్రాంతంలో కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. వరికుంటపాడు, భాస్కరాపురం గ్రామాల పరిధిలోని సర్వే నెం.233-1లోని 16.72 హెక్టార్లలో 1,65,798 టన్నుల మైనింగ్ తరలించేందుకు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు లీజు మంజూరు చేసింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సర్పంచ్ దిలీప్‌కుమార్‌తో సహా గ్రామస్థులు మూకుమ్మడిగా తమ నిరసన గళం వినిపించారు. గతంలోనూ తాము వ్యతిరేకించామని, అదే రీతిలో ఇప్పుడూ ప్రయత్నాలు సాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 50 కుటుంబాలకు చెందిన ఎస్సీలమైన తాము ఆ కొండనే కన్నతల్లిగా భావిస్తూ గేదెలు, మూగజీవాలను నమ్ముకుని జీవిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలు సాకుగా తవ్వకాలు సాగించాలనే ఉద్దేశం ఉంటే ముందస్తుగా తమ కుటుంబాలకు విషమిస్తే తాగి మరణిస్తామని బోరున విలపించారు. నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ శ్రీపూజ మాట్లాడుతూ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించడంతో పాటు సంబంధిత శాఖల అధికారులు, ప్రాజెక్టు ప్రతినిధుల నుంచి సేకరించిన నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చట్టపరంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ శాఖ ఈఈ అశోక్‌కుమార్, తహసీల్దారు హేమంత్ కుమార్, వీఆర్వో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● పోలీసుల పహారా నడుమ

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉదయగిరి సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, పోలీసు బలగాలు భారీస్థాయిలో మోహరించాయి. వివాదాలకు తావులేకుండా ఎప్పటికప్పుడు ప్రజలను నియంత్రిస్తూ సమావేశం సజావుగా సాగేలా చర్య లు చేపట్టారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కేసులు బనాయించడంతో అధికశాతం మంది తమ నిరసనను వ్యక్తం చేసేందుకు రాలేని పరిస్థితుల్లో నివాసాలకే పరిమితమయ్యారని సర్పంచ్ వాపోయారు.



పోలీసులపై అసహనం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

కొత్తగా ఉద్యోగంలో చేరితే రూ.15వేలు సాయం

● ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా 'పీఎం వికసిత్ భారత్'

● ఈపీఎఫ్ అధికారులు



విజయ డెయిరీలో జరిగిన ఈపీఎఫ్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు (వెంక టేశ్వరపురం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి నూతనంగా ఉద్యోగంలో చేరిన ప్రతీ కార్మికుడికి కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.15వేల చొప్పున రెండేళ్ల ఆర్థిక తోడ్పాటును అందిస్తుందని జిల్లా ఈపీఎఫ్ అధికారులు కృష్ణారావు, సుబ్రహ్మణ్యం తెలిపారు. దేశ వ్యాప్తంగా 3.5కోట్ల ఉద్యోగాల కల్పనే లక్షంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గారి పథకాన్ని ప్రవేశ పెట్టిందని చెప్పారు. నెల్లూరు వెంకటేశ్వరపురంలోని విజయ డెయిరీలో గురువారం నూతన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగం కల్పించిన పరిశ్రమ యాజమాన్యానికి కూడా ప్రతీ నెల కార్మికుడి జీతంలో 10శాతాన్ని కేంద్రం అందజేస్తుందని చెప్పారు. పరిశ్రమల యాజమానులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్మికుల పీఎఫ్‌కు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా నెల్లూరు మినీ బైపాస్‌లోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ అధికారులు శ్రీనివాసులు, చంద్ర, రాజశేఖర్ రెడ్డి, శివయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఘర్షణపై డీడీ విచారణ



కలువాయి ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులను విచారిస్తున్న సాంఘిక సంక్షేమశాఖ డీడీ శోభారాణి

కలువాయి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగిందన్న సమాచారం అందడంతో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి గురువారం విచారణ చేపట్టారు. ఈవిషయమై విద్యార్థులను ఆమె విచారించారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ రాత్రి హాస్టల్‌లో కరెంట్ లేనప్పుడు విద్యార్థులు కొట్టుకున్నట్లు, ఆ సమయంలో సిబ్బంది ఎవ్వరూ అక్కడ లేనట్లు తమ దృష్టికి వచ్చిందని, దీంతో ఈ విషయమై విచారణ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అయితే విద్యార్థులు ఇక్కడ ఎలాంటి గొడవ జరగలేదని, ఆ సమయంలో వాచ్‌మెన్ కూడా హాస్టల్‌లో ఉన్నట్లు తెలిపినట్లు ఆమె చెప్పారు. ఈవిషయమై హైస్కూల్ హెచ్ఎంను కూడా కలసి మాట్లాడతామని తెలిపారు. ఆమె వెంట పొదలకూరు ఏఎస్‌డబ్ల్యు సుధామణి ఉన్నారు.

రాజకీయాల్లో కీలకంగా మహిళలు

● జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ● మహిళా జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు శిక్షణ

నెల్లూరు (జడ్పీ), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడూ ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండే మహిళలు నేడు రాజకీయాల్లో అనేక పదవుల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నెల్లూరు లోని జడ్పీ సమావేశ మందిరంలో గురువారం మహిళా జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఇప్పుడు పాలనతోపాటు, ప్రణాళికలు, నిధుల కేటాయింపులో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థ చట్టబద్ధత పొందిందని, తద్వారా గ్రామాల్లో స్వయం పాలనకు అవకాశం కల్పించిందన్నారు. ఇందులో ఒక ముఖ్యమైన విషయం మహిళలకు కనీసం 33 శాతం రిజర్వేషన్ కల్పించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహనరావు కూడా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ

వయోజనవిద్య నోడల్ ఆధికారిగా మస్తాన్‌రెడ్డి

నెల్లూరు(విద్య), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వయోజన విద్య విభాగం నోడల్ అధికారిగా మల్లు మస్తాన్ రెడ్డి నియమితులయ్యారు. వయోజన విద్యలో అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను నోడల్ అధికారిగా నియమిస్తూ ఆ విభాగం జాయింట్ డైరెక్టర్ బీ ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మస్తాన్ రెడ్డి గురువారం కలెక్టర్ ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవతం చేస్తానని తెలిపారు.

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం

● విద్యుత్ ఎస్ఈ విజయన్

● బ్రిడ్జ్ టోర్నమెంట్‌లో ఏపీఎస్‌పీడీసీఎల్ ఉద్యోగుల విజయం

నెల్లూరు (జడ్పీ), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని విద్యుత్ శాఖ ఎస్ఈ వీ విజయన్ అన్నారు. నెల్లూరు క్లబ్‌లో నిర్వహించిన 47వ ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు బ్రిడ్జ్ టోర్నమెంట్‌లో ఏపీఎస్‌పీడీసీఎల్ ఉద్యోగులు విజయం సాధించారు. విజేతల బృందంలో ఎస్ఈ విజయన్, ఈఈ శంకర్, డీఈఈలు ప్రభాకర్, అమీర్ బాషా ఉండడంతో గురువారం ఫోన్ ద్వారా దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ కే సంతోషరావు, డైరెక్టర్లు కే గురవయ్య, అయూబ్ ఖాన్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఉద్యోగులు తమ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి క్రీడలను జీవనశైలిలో భాగం చేసుకోవా లన్నారు. టోర్నమెంట్‌లో ఏపీ ఆటగాళ్లు మొదటి స్థానం సాధించగా జట్టులోని ఆటగాళ్లు అందరూ ఏపీఎస్‌పీడీసీఎల్‌కు చెందిన వారేనని చెప్పారు. తమ గెలుపు విద్యుత్ సంస్థకు అంకితమన్నారు. కాగా, డిస్కమ్, జిల్లాలోని అధికారులు, సిబ్బంది, ట్రేడ్ యూనియన్ నేతలు, అసోసియేషన్ నేతలు విజేతలకు అభినందనలు తెలియజేశారు.



చైర్మన్‌తో ఫోన్ ఇన్‌లో పాల్గొన్న టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు, ఉద్యోగులు

నేడు వెంగమాంబ హుండీల లెక్కింపు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయంలో హుండీల లెక్కింపు శుక్రవారం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేవదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల సమక్షంలో హుండీల లెక్కింపు జరుగుతుందని ఆయన తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9488
వెండి కిలో ధర	రూ. 118100
వెండి ఒక గ్రాము	రూ. 121.10

న్యూస్ బాక్స్

బాలచౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



చందనాలంకారంలో బాలచౌడేశ్వరిదేవి

సంగం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగం రాళ్లచెలిక వీవర్స్ కాలనీలో ఉన్న బాలచౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడ మాసం అమావస్య రోజు తొగటవీర క్షత్రియుల కులదైవమైన బాలచౌడేశ్వరిదేవి జయంతిని ఏటా ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారికి చందనాలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా గ్రామోత్సవం



కడవ బాణం గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సంగం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తూరులో ఉన్న బాలచౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారి జయంతిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం కడవ బాణం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌ను గజపూలమాలలతో అలంకరించారు. అనంతరం తొగటవీరక్షత్రియ భక్తుల భజన బృందంతో కడవ బాణం మహోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ఆస్థాన నుంచి ఊరేగింపుగా గంధాన్ని దర్గాకు తీసుకొస్తున్న భక్తులు

ఉదయగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్‌సాహెబ్ ఖాదరీఔలియా వారి గంధ మహోత్సవంలో భాగంగా మూడో రోజైన గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యులు స్వామివారికి జప్పెచిరాగి పాతెహ (దీపారాధన) కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే ఖాదరీయ ఆస్థాన నుంచి అధ్యక్షుడు అహమ్మద్‌బాషా ఆధ్వర్యంలో భక్తులు గంధాన్ని ఊరేగింపుగా ఖాన్ సాహెబ్ దర్గాకు చేర్చారు. చదివింపుల అనంతరం భక్తులకు పంచిపెట్టారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నిర్వాహకులు రాత్రికి ఖవ్వాలీ పాటకచ్చేరీ ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధితులకు నగదును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల ముగ్గురు మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు గురువారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. 5వ వార్డు పరిధిలో చిన్నకాలేషా, 18వ వార్డు పరిధిలో రాగి సుబ్బమ్మ, 23వ వార్డులో మామిడూరు హజరత్తయ్య కుటుంబాలను ఆయన పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ జి వేణు, బిజెపి పట్టణ మాజీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల రహదారులు ఛిద్రమై రాళ్లు, రప్పలతో నిండి ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక వాహనాలు నిరంతరం మరమ్మతులకు గురవుతున్నాయని, అత్యవసర సమయాల్లో అద్దె వాహనాలు కూడా గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రధాన రహదారుల నుంచి జీ.కొత్తపల్లి, నల్లబోతులవారిపల్లి, జంగంరెడ్డిపల్లి, పామూరుపల్లి, సాతువారిపల్లి తదితర గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. దారి పొడవునా గుంతల మయంగా మారి రాళ్లు తేలి ఉండడంతో ప్రయాణాలు సాగించే ప్రజలు ఎక్కడ జారి పడతామోననే భయందోళ నతో ముందుకు సాగాల్సిన దుస్థితి నెలకొంది. విద్యుత్ దీపాలు సైతం లేకపోవడంతో రాత్రి సమయాల్లో పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో అటుగా ఆటోలు, ద్విచక్ర వాహనాలే అధిక సంఖ్యలో పరుగులు తీస్తుంటాయి. దీంతో దుమ్ము, ధూళితో అవస్థలు పడాల్సి వస్తోందని, అంతేగాక గ్రావెల్ రహదారులు కావడంతో చిన్నపాటి వర్షాలకు సైతం చిత్తడిగా మారుతుండడంతో ఎక్కడ ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుందోనని అడుగు ముందుకు వేయాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుంతలమయంగా ఉన్న రామాపురం-కాకొల్లువారిపల్లి రహదారి

కలగా మిగిలిన రింగురోడ్డు నిర్మాణం

కాగా, రామాపురం జాతీయ రహదారి నుంచి కాకొల్లువారిపల్లి జాతీయ రహదారి వరకు మంజూరైన రింగురోడ్డు నిర్మాణం కలగానే మిగిలింది. ఇప్పటికే రెండుసార్లు టెండర్ల ప్రక్రియ కొనసాగినా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కన్నెత్తి చూడడం లేదు. గత టీడీపీ ప్రభుత్వం రూ. 3.80కోట్లతో పనులు మంజూరు చేసింది. అయినప్పటికీ పనులు కొనసాగించనే లేదు. వైసీపీ ప్రభుత్వం మరోమారు రూ. 3.50 కోట్లతో టెండర్లను కొనసాగించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఏళ్ల తరబడి ఇదే తంతు కొనసాగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు తమ కల ఎప్పుడు నెరవేరుతుందా అంటూ ఆశగా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామీణ రహదారుల నిర్మాణం పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం పట్టణంలోని గంగమిట్ట ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీచేస్తూ ఏడాది కాలంలో ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తల్లికి వందనం అందిన విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, సర్పంచ్ నల్లగొండ సృజన, నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెస్ నాయుడు, ఆనంగి రమణయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు డేగ మధుయాదవ్, జనసేన మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వింజమూరు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

●సీతారామపురం : మండల పరిధిలోని గుండుపల్లి, బసినేనిపల్లి, సీతారామపురం గ్రామాలలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం టీడీపీ నేతలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తూ తెలుగుదేశం ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ జాషువా, పసుపులేటి వికాష్ బాబు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు తురక వెంకటేశ్వర్లు, మండల ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ బాబు, ఇజ్రాయిల్, సిద్దయ్య, తోట మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'అయ్యంకి' జయంతి



సంగం: అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంగం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●వింజమూరు: పట్టణంలోని లైబ్రరీలో గురువారం గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జే.కొండయ్య, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

లేగదూడల అందాల పోటీలు



పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్న అధికారులు

చేజర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామంలో గురువారం లేగదూడల అందాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి అధికారులు డి శ్రీనివాసరావు, డా. నాగమణి పాల్గొని పాడిరైతులకు సలహాలు సూచనలు అందజేశారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందులను అందజేశారు. పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు డా. గురుజయంతి, డా. కృష్ణమోహన్, డా. కృష్ణప్రసాద్, డా. రాజేష్, నాయకులు అన్నలూరు శ్రీనివాసులనాయుడు. కొమ్మి రమేష్‌నాయుడు, పాడి రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మాదాలకు ఘన నివాళులు

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో గురువారం టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ మాదాల రామచంద్ర ప్రథమ వర్థంతి నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల తిమ్మయ్య, మల్లంపాటి గురవయ్యానాయుడు, రావినేని వెంగయ్య, చినతిమ్మయ్య, మేకపాటి మాల్యాద్రినాయుడు, హరి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం

మర్రిపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్ ఆవరణలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం ముగిసింది. ఎన్నారై కొర్రపాటి ప్రియ స్వచ్ఛందంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రియ మీడియాతో మాట్లాడుతూ 1600 మందికి 8రకాల వైద్య పరీక్షలు చేసి, అక్కడ ఏర్పాటుచేసిన మొబైల్ సర్జికల్ బస్సులో 160మందికి ఆపరేషన్లు జరిపినట్లు, కంటి చూపు తీవ్రతను బట్టి 140మందిని చెన్నైలోని శంఖర్ నేత్రాలయానికి పంపుతున్నట్లు తెలిపారు.

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఉదయగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక శోభ కాంప్లెక్సులో గురువారం చంద్రబాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైసీపీ నేతలు నిర్వహించారు. ఈసందర్భంగా వైసీపీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు అలీఅహ్మద్, శ్రీనివాసులరెడ్డి, గొల్లపల్లి తిరుపతి, ముర్తుజా, తదితరులు పాల్గొన్నారు.

●సీతారామపురం: బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో, పోస్టర్లను, క్యూఆర్‌కోడ్లను వైసీపీ నాయకులు విడుదల చేశారు.

ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే ఇవ్వాలి : ఎస్‌డబ్ల్యూఎఫ్

ఆత్మకూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ ఆర్టీసీ సంస్థకే ఇవ్వాలని, ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ సంస్థలకు కేటాయించవద్దని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షుడు మహ్మదాలీ, రీజనల్ బాధ్యులు యు నరసింహులు మాట్లాడుతూ విజయవాడ గవర్నర్‌పేట-2 డిపో, విజయవాడ పాత బస్టాండ్ స్థలాలను బహుళజాతి సంస్థ లూలూ షాపింగ్‌మాల్‌కు ఇచ్చే ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల భవిష్యత్తు రవాణా అవసరాలకు ఉపయోగపడే ఆర్టీసీ స్థలాలు అన్యాకాంతం కాకుండా కాపాడాల్సిన ప్రభుత్వమే ఇలాంటి చర్యలకు పూనుకోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి ఏ వెంకటేశ్వర్లు, వైస్‌ప్రెసిడెంట్ సుందరయ్య, జాయింట్ సెక్రటరీ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో ఎదుట నిరసన చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతలు

క్రమశిక్షణతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ : డీఎస్పీ

ఆత్మకూరు, జూలై 24 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఎస్పీ వేణుగోపాల్, సీఐ గంగాధర్ తెలిపారు. స్థానిక గాయత్రి ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు సమాజంలో జరుగుతున్న అనైతిక కార్యక్రమా లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాలిక లకు ఎవరైనా ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎలాంటి ప్రభావాలకు గురికాకుండా చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ పద్మప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ

ఆటపాటలతో విద్యాబోధన చేయాలి

ఉదయగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆటపాటలతో విద్యాబోధన చేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. గురువారం మండలంలోని మాసాయిపేట హరిజనవాడ, మెయిన్, ఉర్దూ పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన డిక్షనరీలు ప్రతిరోజు విద్యార్థులు ఉపయోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షేక్ అర్షియాబేగం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈవో

వసతి గృహం మరమ్మతు పనుల పరిశీలన

చేజర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చేజర్లలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని గురువారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి కే శోభారాణి తనిఖీ చేశారు. ఇటీవల బాలుర వసతి గృహానికి మరమ్మతుల కోసం సుమారు రూ. 12 లక్షలు మంజూరై ప్రస్తుతం పనులు జరుగుతున్న నేపథ్యంలో వాటిని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. వసతిగృహంలో ఉండే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు ఏఎస్‌డబ్ల్యు సిహెచ్. సుధామణి, వార్డెన్ ఎమ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతులను పరిశీలిస్తున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి శోభారాణి

నిత్యావసర సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీలో చౌక దుకాణ డీలర్లు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ తహసీల్దారు నిమ్మల చెంచయ్య అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు బాధ్యతగా వ్యవహరించి 1 నుంచి 15వ తేదీ వరకు దుకాణాల వద్ద సరుకులు పంపిణీ చేయాలన్నారు. అలాగే 26 నుంచి 30వ తేదీ వరకు వృద్ధులు, దివ్యాంగుల నివాసాల వద్దకే వెళ్లి సరుకులు అందజేయాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఫోర్జరీ సంతకాల కేసులో మాజీ మంత్రి కాకాణికి రిమాండ్

నెల్లూరు (లీగల్), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ భూముల స్వాహా కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి వచ్చే నెల 7వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపుతూ నెల్లూరు నగర మొదటి తరగతి రెండవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శారదారెడ్డి గురువారం ఉత్తర్వు చేశారు. మోసం, దగా, కుట్రలతో వెంకటాచలం తహసీల్దారు కార్యాలయంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి రికార్డులను తారుమారు చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారన్న కేసులో కాకాణి 14వ నిందితుడిగా ఉన్నారు. తొలుత జిల్లా జైలులో ఉన్న కాకాణిని వర్చువల్ విధానంలో పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరు పరిచారు. ఇరువైపులా వాదనలు విన్నాక న్యాయమూర్తి కాకాణిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపుతూ ఉత్తర్వు చేశారు.

బస్సు చక్రాల కింద నలిగిన ప్రాణం

నెల్లూరు(క్రైం), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. సుమారు 55 ఏళ్ల వ్యక్తి బుధవారం రాత్రి నెల్లూరులో మినీబైపాస్‌లోని మిలీనియం సబ్‌స్టేషన్ వద్ద ఉన్నాడు. ఆత్మకూరు బస్టాండు వైపు నుంచి వచ్చిన బస్సు యూటర్న్ తీసుకునే సమయంలో ఆ వ్యక్తిని ఢీకొనడంతో కిందపడ్డాడు. బస్సు వెనుక చక్రం అతని నడుముపైకి ఎక్కడంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇది గమనించిన స్థానికులు క్షతగ్రాతుడిని చికిత్స నిమిత్తం 108 సాయంతో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ పోలీసులు వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విషం తాగి వ్యక్తి మృతి

వెంకటాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇస్కపాళెంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శ్రీనివాసులు అనే వ్యక్తి విషం తాగాడు. నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు మృతుడి కుమారుడు ఎన్ మహేష్ తెలిపాడు. తండ్రి శ్రీనివాసులు గత పదేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతుండేవాడని, వ్యక్తిగత పనులు కూడా చేసుకోలేకపోయేవాడన్నారు. ఆ బాధతోనే విషం తాగాడని, దీంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి మహిళకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విబూది పుల్లమ్మ

కలువాయి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని తోపుగుంట సమీపంలో గురువారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. వెంకటరెడ్డిపల్లి జంగాల కాలనీకి చెందిన విబూది పుల్లమ్మ ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుని ఆదూరుపల్లి నుంచి తిరిగి ఇంటికి ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చొని వస్తోంది. తోపుగుంట సమీపంలోకి వచ్చేసరికి ఆటోనుంచి పుల్లమ్మ తూలి పడిపోతుండగా డ్రైవర్ ఆమెను పట్టుకునే ప్రయత్నంలో ఆటో అదుపుతప్పడంతో వారు కింద పడ్డారు. వారిపై ఆటో పడడంతో పుల్లమ్మకు తీవ్ర గాయం కావడంతో కలువాయి పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్యం అనంతరం నెల్లూరుకు తరలించారు.


బస్సు చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూలై 24 (ఆంధ్రజ్యోతి): బస్సు చోరీ చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.... నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండులో ఉన్న ఆత్మకూరు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సును బుధవారం తెల్లవారుజామున విడవలూరు మండ లం కంచరపాలెం గ్రామానికి చెందిన బిట్రగుంట కృష్ణ అపహరించుకు వెళ్లారు. డిపో మేనేజర్ శివకేశవ యాదవ్ ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం అర్ధరాత్రి నిందితుడిని అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరు పరిచామని పోలీసులు తెలిపారు. అయితే నిందితునికి మతిస్థిమితం లేనట్లు పోలీసులు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

కావలి రూరల్, జూలై24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మోటారు బైక్‌లను చోరీచేసి, వాటిని కుదువ పెడుతున్న ఇద్దరు నిందితులను గురువారం అరెస్ట్ చేసినట్లు ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు, ఇటీవల పట్టణంలోని రైల్వే స్టేషన్ దగ్గర పార్కుచేసిన రెండు బైకులు, యానాదిరెడ్డి వీధిలో ఇంటి ముందు ఉంచిన ఓ బైక్‌ను నిందితులు చోరీచేశారు. వాటిని కుదువపెట్టే ప్రయత్నంచేశారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ సుమన్, సిబ్బంది గాయత్రీ నగర్‌కు చెందిన ఎస్‌కె సుభానీ, అరుంధతీయపాలెంకు చెందిన దావులూరి సృజన్‌ను నిందితులుగా గుర్తించి, వారి వద్ద నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.


కావలి కాలువ వంతెన రక్షణ గోడలు శిథిలం



శిథిలమైన కావలి కాలువ వంతెన రక్షణ గోడలు

సంగం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరుపాడు వద్ద కావలి కాలువ వంతెన రక్షణ గోడలు శిథిలమై ప్రమాదకరంగా మారింది. గ్రామానికి చెందిన 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రతిరోజు ఈ వంతెన మీదనే రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో కొంతమంది విద్యార్థులు సైకిల్‌పైన, మరికొంత మంది విద్యార్థులు నడిచి వెళతారు. సుమారు పది అడుగుల లోతు ఉండే రక్షణ గోడలులేని కాలువ వంతెనపై ప్రయాణం చేసే విద్యార్థులకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా బద్వేల్ రోడ్డు



ముళ్లపొదలతో మూసుకుపోయిన రోడ్డు

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): అనంత సాగరం నుంచి బద్వేల్‌కు వెళ్లే ప్రధాన రహదారి గౌరవరం ఉత్తర కాలువ సమీ పంలో రోడ్డు ముళ్లపొద లతో మూసుకొని ప్రమా కరంగా మారింది. దీంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి ముళ్లపొదలను తొలగించి ప్రమాదాలు నివారించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 475

'వీరమల్లు' సంబరాలు



జలదంకి, జూలై24(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు చిత్రం విడుదలను పురస్కరించుకుని స్థానిక నిమ్మలపల్లి శ్రీనివాసులు రైస్‌మిల్లు ఆవరణలో గురువారం జనసేన, టీడీపీ నాయకులు, పవన్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను నియోజకవర్గ జనసేన నాయకుడు రామ్‌చైతన్య, టీడీపీ యువనేత గంటా అశోక్, మండల జనసేన అధ్యక్షుడు తోట మురళి కట్ చేశారు. కార్యక్రమంలో పవన్ అభిమానులు రేవంత్, సవన్, సుబాని, కళ్యాణ్, నందు, చైతన్య, రంజిత్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మూడేళ్లుగా ఆటల్లేవు!

- వ్యాయామ ఉపాధ్యాయుల్లేక క్రీడలు బంద్
- బదిలీపై వెళ్లినవారి స్థానంలో జరగని నియామకాలు
- ఆగస్టులోనైనా భర్తీ అయ్యేనా ?

కొండాపురం, జూలై24(ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఆనందాన్ని పెంపొందించుతాయని అనాది నుంచి వస్తున్న నానుడి. క్రీడల ప్రాముఖ్యతను గుర్తించిన విద్యాశాఖ పాఠశాలల్లో కాలపట్టికలోనూ ప్రత్యేకంగా సమయం కేటాయించింది. దీంతో ప్రతిరోజూ క్రీడలను ఆడించేవారు. క్రీడలలో రాణించిన విద్యార్థులకు అందచేసే సర్టిఫికెట్ వారికి ఉన్నత చదువులు, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు దోహదపడుతున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన క్రీడలను నేర్పించేందుకు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించడం లేదు.

● వ్యాయామ ఉపాధ్యాయులేరీ..?

మండలంలో 9 జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక ఆదర్శ, ఓ కేజీబీవీ పాఠశాలలతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. ఆరు నుంచి ఇంటర్ వరకు సుమారు 1200 మంది వరకు చదువుతున్నారు. గతంలో మండలం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన క్రీడలలో విద్యార్థులు రాణించారు. రోప్ స్కిప్పింగ్, రన్నింగ్ రేస్ తదితర క్రీడల్లో ఈ ఘనతను సాధించారు. అలాగే కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థులూ ఉన్నారు. సుమారు మూడేళ్ల నుంచి పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. దీంతో మైదానాల్లో ఆటలు కరువయ్యాయి. కాగా ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో అర్హులయిన వారికి ఆగస్టులో నియామక పత్రాలు అందనున్నాయి. వారితోనైనా వ్యాయామ ఉపాధ్యాయుల భర్తీ జరుగుతుందని పాఠశాలలల హెచ్‌ఎంలు అంటున్నారు.



ఆదర్శ పాఠశాల క్రీడామైదానంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

నేడు ఆధార్ కేంద్రం ఏర్పాటు

వలేటివారిపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గ్రామ సచివాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో నరేంద్రదేవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులోని పేర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర మార్పులు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

కందుకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు భోజనం ప్లేట్లు, నోట్‌పుస్తకాలు,పెన్సిళ్లు, వాటర్‌బాటిల్స్‌ను గురువారం మేక్ ఏచేంజ్ సొసైటీ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సొసైటీసభ్యులు విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు తోడ్పాటునందిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రవ్వా శ్రీనివాసులు, చిన్ని వెంకట సాయిపూర్ణతేజ, కోట వెంకటేశ్వర్లు, గుర్రం చిన అల్లూరయ్య, ఉపాధ్యాయులు కె. పద్మజ, ఎం. శేషమ్మ, సీఆర్‌పీ ప్రతిభ పాల్గొన్నారు.

వైసీపీ నేత వెంట మండల రిసోర్స్ కోఆర్డినేటరు



వైసీపీ ఇన్‌చార్జి రాజగోపాల్‌రెడ్డి వెంట ఉన్న మురళి

కొండాపురం, జూలై24(ఆంధ్రజ్యోతి): మండల రీసోర్స్ కోఆర్డినేటర్ ఎం. మురళి తూర్పుఎర్రబల్లిలో రెండు రోజులక్రితం జరిగిన వైసీపీ కార్యక్రమంలో పాల్గొనగా, గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన మురళిని గత ప్రభుత్వంలో కలెక్టరు ఉత్తర్వుల మేరకు కాంట్రాక్ట ప్రాతిపదికన మండల రీసోర్స్ కోఆర్డినేటర్‌గా నియమించారు. ఆయన భార్య గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. గ్రామంలో ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ వైసీపీ కార్యక్రమంలో పాల్గొనడమేమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

నేడు మంత్రి కొలుసు పార్థసారథి రాక

ఉలవపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణశాఖామంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం మండలంలోని భీమవరం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి వస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఎవరివాటా ఎంతో నిగ్గు తేల్చండి : ప్రతాప్

కావలి(టౌన్), జూలై24(ఆంధ్రజ్యోతి) పట్టణంలో జరిగిన మనీ స్కామ్ కుంభకోణం రూ. 800కోట్ల పైమాటేనని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి డిమాండ్ తెలిపారు. గురువారం ముసునూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ మొత్తంలో ఎవరెవరు... వాటాలు పంచుకున్నారో... కేసు ఎందుకు మరుగనపడిందో నిగ్గు తేల్చాలని ఆయన ప్రశ్నించారు. ఈ స్కాంలో కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి రూ.100 కోట్ల వరకు చేరిందని, సీబీఐ విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన చెప్పారు. ఈ స్కామ్‌లో కానిస్టేబుల్ రాధాకృష్ణ, అయోధ్య, ఎస్‌ఐ తిరుమలరెడ్డి పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తున్నదన్నారు. కేసు నీరు గార్చేందుకు రూరల్ సీఐ రాజేశ్వరరావు, డీఎస్పీ ప్రయత్నాల్లో భాగంగా, సుభానీని తెలంగాణ పోలీసులకు అప్పజెప్పి చేతుల దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

బదిలీ అయిన టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలి

బీటీఏ గౌరవాధ్యక్షుడు

కందుకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులందరికీ తక్షణం జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె. మోహనరావు కోరారు. బదిలీలు జరిగి రెండునెలలైనా నేటికీ ఆ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవటం బాధాకరమన్నారు. జీతాలు చెల్లించకుంటే పోరాటం తప్పదన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో బీటీఏ డివిజన్ కమిటీ సమావేశం షేక్ అబ్దుల్లా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న బీటీఏ నాయకులు పలు ఉపాధ్యాయ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. సమావేశంలో బీటీఏ నాయకులు కె.రమేష్, ఎం. రమణయ్య, చొప్పర కొండలరావు, ఉప్పుటూరి సుబ్రహ్మణ్యం, ధన్యాసి కోటేశ్వరరావు, మెండా వెంకటరావు, కేవై కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన సీఎం చంద్రబాబుకే సాధ్యం



సీసీడ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించగలిగిన ఏకైక నాయకుడు సీఎం చంద్రబాబునాయుడేనని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని మక్కామసీదు ప్రాంతంలో గురువారం సాయంత్రం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డులోని ప్రతిఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకుంటూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా ఆరాతీశారు. ఈ సందర్భంగా మక్కామసీదు వద్ద నిర్మించతలపెట్టిన సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు. కందుకూరును అత్యంత సుందరంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. అనూష, డీఈ గణపతి తోపాటు పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, షేక్ నాయబ్‌రసూల్, మున్నా, ఫిరోజ్, అహ్మద్‌బాషా, నసీర్, తదితరులు పాల్గొన్నారు.

● సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కందుకూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 25మందికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 11.66 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి గురువారం బాధిత కుటుంబాల వారికి అందజేశారు.

● ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి

కందుకూరు నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకులు ఇష్టారీతిగా మాట్లాడుతున్నారని, వారు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడకపోతే చట్టం తన పనితాను చేస్తుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో గత 40 సంవత్సరాలలో ఎన్నడూ జరగనంత వేగంగా ఈ ఏడాదిలో అభివృద్ధి జరిగిందన్నారు. ఈతరుణంలో ఓర్వలేని ప్రతిపక్షాల నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని అలాంటి వారంతా ఒళ్లుదగ్గర పెట్టుకుని మాట్లాడకపోతే తగిన పరిణామాలు చూస్తారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమిట్ల గురునాథం, జనిగర్ల నాగరాజు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలే ప్రభుత్వాల అజెండా



సభలో మాట్లాడుతున్న దామా అంకయ్య

కావలి(టౌన్), జూలై(ఆంధ్రజ్యోతి) ప్రజావ్యతిరేక విధానా లే అజెండాగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ఆరోపించారు. పట్టణంలోని షాదీమంజిల్‌లో గురువారం సీపీఐ నియోజకవర్గ 25వ మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి దాసోహంగా పనిచేస్తుందని అన్నారు. బ్రిటీష్ పాలకులకు వత్తాసు పలికిన బీజేపీ నేడు నిజమైన దేశభక్తులమని చెప్పుకుంటూ పాలిస్తున్నదన్నారు. కరేడ్ రైతుల నుంచి 8వేల ఎకరాల పంట పొలాలు బలవంతంగా లాక్కోవాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ఈ సభలో జిల్లా సహాయ కార్యదర్శి మాలకొండయ్య, నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుపై వీఏఏలకు శిక్షణ



వీఏఏ, వీహెచ్‌ఏలకు శిక్షణనిస్తున్న ఉద్యానశాఖాధికారులు

కలిగిరి, జూలై24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేటలో గురువారం ఆయిల్‌ఫామ్ సాగుపై వీఏఏ, వీహెచ్‌ఏలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతోపాటు పంటలకు ఆశించే చీడపీడలు, మార్కెటింగ్ ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సాంప్రదాయ పంటలను సాగుచేస్తున్న రైతులకు ఆదాయం ఆశించినంత రావడంలేదన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఆయిల్‌ఫామ్ సాగు ఆశాకిరణంగా మారిందన్నారు. జిల్లాలో1400 హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీహెచ్ అనూరాధ, వింజమూరు ఏడీఏ శేషగిరిరావు, ఉద్యానశాఖాధికారులు రాజశేఖర్, కార్తీక్‌భరద్వాజ్, సుధామయి, జయశ్రీ, ఆయిల్‌ఫామ్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో రెడ్‌క్రాస్‌ను ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ

కావలి, జూలై24(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ప్రతీ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ శాఖలను ప్రారంభించాలని ఆర్డీవో, కావలి రెడ్‌క్రాస్ అధ్యక్షుడు ఎం. సన్నీవంశీ క్రిష్ణ పిలుపునిచ్చారు. ఆర్డీవో కార్యాలయ సమావేశమందిరంలో గురువారం డివిజన్‌లోని హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లకు జూనియర్, యూత్ రెడ్‌క్రాస్‌లపై అవగాహన కల్పించారు. తొలుత రెడ్‌క్రాస్ స్థాపకులు సర్ జీన్ హెన్రీడునాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి, జూనియర్ రెడ్‌క్రాస్ నోడల్ ఆఫీసర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ ఎవరికైనా గుండె కొట్టుకోవటం ఆగినపుడు చేయాల్సిన ప్రాథమిక చికిత్స(సీపీఆర్)ప్రక్రియను ప్రతి విద్యార్థికి నేర్పించాలన్నారు. అందుకు కావలి రెడ్‌క్రాస్ సహకారం అందిస్తోందన్నారు. రెడ్‌క్రాస్ రీసోర్స్‌పర్సన్ షేక్ అబ్దుల్‌కలాం రెడ్‌క్రాస్‌ల పనివిధానం, మార్గదర్శకాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు ఏ. రమేష్‌రెడ్డి, స్థానిక రెడ్‌క్రాస్ చైర్మన్ డీ. రవిప్రకాష్, వైస్ చైర్మన్ కే.హరినారపరెడ్డి. కోశాధికారి ఏ.మధుసూదనరావు, పాలక మండలి సభ్యులు డాక్టర్ పీ. శ్రీధర్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఇలింద్ర శ్రీవాణి, జనిగర్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి పారుదలకు ఆటంకం లేకుండా చర్యలు

కావలి,జూలై24(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలు, రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని కాలువల్లో వర్షపునీరు, మురుగునీరు పారుదలకు ఆటంకాలు లేకండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన బాలక్రిష్ణారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక నేతలతో కలిసి పర్యటించారు. ఎక్కడా వర్షపునీరు నిల్వ ఉండకుండా కాలువలను,డ్రైనేజీలను పూడికలు తీసి శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. కచ్చా రోడ్లపై కూడా నీరు నిలబడకుండా తొలగించాలని ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల వారికి ఆదేశాలుజారీ చేశామన్నారు.



మురుగు కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, తదితరులు

9 మంది పేకాట రాయుళ్ల అరెస్టు



పోలీసులకు పట్టుబడిన పేకాటరాయుళ్లు

గుడ్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాలిపేట గ్రామ సమీపంలోని పొలాల్లో రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు గ్రామస్థులు కొందరు పోలీసులకు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్‌ఐ వెంకట్రావు తమ సిబ్బందితో వెళ్లి గురువారం 9మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,720 స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిదిమందిపై కేసు నమోదుచేసి, కందుకూరు కోర్టులో హాజరుపరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్ల పంపిణీ చేస్తున్న దాతలు

కావలి(టౌన్),జూలై24(ఆంధ్రజ్యోతి): శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షురాలు పొన్నగంటి మాధవి అధ్యక్షతన గురువారం పేద మహిళలకు కుట్టుమిషన్లు అందచేశారు. అనంతరం ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రిటైర్డ్ హెచ్‌ఎం స్వర్గీయ చిడిపోతు పాపయ్య-కృష్ణకుమారి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తెలు, అల్లుళ్లు అనిత-రామకృష్ణనాయుడు, కవిత- కిరణ్‌కుమార్ దాతృత్వంతో ఐదుగురికి కుట్టుమిషన్లు అందించారన్నారు. కార్యక్రమంలో అతిథులుగా మున్సిపల్ మేనేజర్ ఫణికుమార్, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఎస్కె ఖాదర్‌బాష, మాజీ కౌన్సిలర్ పులి రజని, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పులిచక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

కత్తి పద్మారావు జయంతిని జయప్రదం చేయండి



నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

అల్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కారంచేడు దుర్ఘటన పై న్యాయం కోసం ఉద్యమాన్ని చేపట్టిన కత్తి పద్మారావు జయంతిని విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్ రాజు అన్నారు. స్థానిక పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం కారంచేడు ఘటనపై దళితులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల27న బాపట్ల జిల్లా పొన్నూరులో జరగనున్న పద్మారావు జయంతిని పండుగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంగులూరు ప్రసాద్, పంగులూరు సుధాకర్, దానం మాల్యాద్రి, అనపల్లి సుందరం, బాపన విజయకుమార్, వట్టికాల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాలు ప్రైవేటు పరం చేయొద్దు : ఎస్‌డబ్ల్యూఎఫ్



డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్మికులు

కావలి(టౌన్), జూలై24 (ఆంధ్రజ్యోతి) ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ సంస్థలకు అప్పచెప్పవద్దని ఎస్‌డబ్ల్యూఎఫ్ కావలి శాఖ గౌరవాధ్యక్షుడు ఎం వెంకయ్య పేర్కొన్నారు. గురవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిపో వద్ద ధర్నా నిర్వహించారు. కార్మిక నాయకులు మాట్లాడుతూ రూ.కోట్లు విలువ చేసే ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్‌పరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలన్నారు. విజయవాడ గవర్నర్‌పేట-2డిపోను లులు షాపింగ్‌మాల్‌కు ఇచ్చే ప్రతిపాదనలను విరమించాలన్నారు. విలువైన ఆస్తులను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో డిపో నాయకులు కాలేషా, టీ. రోశయ్య, యూ. మధు, ఎస్‌కే. గౌస్ అల్లాబాష పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌లో జేసీ పరిశీలన



వార్డెనును అడిగి వివరాలు తెలుసుకుంటున్న జేసీ కార్తీక్

ఉలవపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని గురువారం సాయంత్రం జేసీకే కార్తీక, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజతో కలిసి సందర్శించారు. హాస్టల్ భవనం నిర్మించి ఎన్నేళ్లు అవుతుంది.... విద్యార్థుల ఎంతమంది ఉన్నారు... వారికి కల్పిస్తున్న వసతుల గురించి వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే నూతన భవనం నిర్మించేందుకు చర్యలు చేపడతామని జేసీ తెలిపారు. అనంతరం హాస్టల్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీలను సందర్శించి, వాటి వివరా లను ఎంఈవో-2 రమణయ్యను అడిగి తెలుసుకున్నారు. జేసీ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో పవన్, రెవె న్యూ సిబ్బంది ఉన్నారు.

నువ్వు పైరులో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్న అధికారులు

లింగసముద్రం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నువ్వు పైరు సాగుచేసిన రైతులు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి హర్షవర్ధన్ తెలిపారు. గురువారం మండలంలోని యర్రారెడ్డిపాలెం, లింగసముద్రం-2 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా యర్రారెడ్డిపాలెంలో సాగు చేసిన నువ్వు పైరును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వీఏఏలు దీప, రేణుక, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్‌ను సద్వినియోగం చేసుకోండి

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ ఒక ప్రకటనలో కోరారు. పదోతరగతి పాసైన విద్యార్థులు సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు ప్రవేశం పొందవచ్చన్నారు.



శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాం

● పీ.శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ, అల్లూరు

అల్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించామని అల్లూరు ఎస్ఐ పీ. శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఎవరైనా సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. చోరీలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు. మండలంలో ప్రజలకు శాంతి భద్రతలు లోపిస్తే అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు.

? : శాంతి భద్రతలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.

! : మండలంలో ఎక్కడా అల్లర్లు జరగకుండా ముందస్తుగా సమాచారం వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు.

?: చోరీలకు పాల్పడే వారిని గుర్తించారా...

! : ప్రస్తుతం చోరీలకు పాల్పడేవారి వివరాలు తెలుసుకునే పనిలోఉన్నాం. త్వరితగతిన వారిని పట్టుకుని తీరుతాం.

? : పేకాట, కోడిపందేల నివారణకు చేపట్టిన చర్యలు.

! : పేకాట, కోడి పందేల ఎక్కడైనా జరిగితే ప్రజలు తమకు సమాచారం అందించాలి. జూదరుల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాం.

ఆశా వర్కర్ల కమిటీ ఏర్పాటు

బిట్రగుంట (దగదర్తి) జూలై 24 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండల ఆశావర్కర్ల కమిటీని గురువారం ఎంపిక చేశారు. దగదర్తిలోని జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ ఎంపికకు జిల్లా యూనియన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి నేతృత్వం వహించారు. మండల కార్యదర్శిగా వై.అనూరాధ, సభ్యులుగా ఆరోగ్యమ్మ, కామేశ్వరమ్మ, పెంచలమ్మ, సునీత, ఎన్ శారద, అరుణమ్మ, డి.శ్రీదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముగ్గురు నిందితుల అరెస్టు

లింగసముద్రం, జూలై 24 9ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురంలో ఈనెల 21న గంగమ్మ గుడిలో హుండీ చోరీ చేసిన నలుగురిలో ముగ్గురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎం. నారాయణ చెప్పారు. గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కనిగిరి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలో అరెస్ట్ చేస్తామని ఆయన తెలిపారు.

'ఎమ్మెల్యేకి అంత అహంకారం పనికిరాదు'

కందుకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అంత అహంకారం పనికిరాదని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు ఒక ప్రకటలో విమర్శించారు. ఈరోజు మీరు మాట్లాడుతున్న భాష, చేస్తున్న హెచ్చరికలు చూస్తుంటే ఎన్నికలకు ముందు కందుకూరులో ప్రశాంతమైన వాతావరణం ఉంచుతానని చెప్పి ఓట్లు వేయించుకున్న విషయాన్ని అప్పుడే మరిచిపోయినట్లుందని ఆయన పేర్కొన్నారు. మీరు మాట్లాడుతున్న భాష చూస్తుంటే మీకు తప్పకుండా సమాధానం చెప్పే తీరుతామని అన్నారు.

సీఎస్‌ఈకి జై...

(5వ పేజీ తరువాయి)

అయ్యాయి. అలాగే వీటీటీకే కళాశాలలో 1248 సీట్లకు 841, ఎస్‌వీసీఎన్ కళాశాలలో 2640 సీట్లకు 1020, డీఎస్‌ఐటీ కళాశాలలో 235 సీట్లకు 66, జీకేసీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో 432 సీట్లకు 116, పీఐఎన్‌ఎన్ కళాశాలలో 96 సీట్లకు 6, పీఆర్‌ఐకే కళాశాలలో 192 సీట్లు 9 సీట్లు భర్తీ అయ్యాయి. అయితే, వీటిలో కూడా సీట్లు అధికంగా భర్తీ అయిన కళాశాలలు ఆనందాన్ని వ్యక్తం చేస్తుండగా సీట్లు భర్తీ కాని కళాశాలల యాజమాన్యాలు మాత్రం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో త్వరలో తిరిగి రెండోసారి వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తే సీట్ల భర్తీ పెరిగే అవకాశం ఉందా లేదా అని వేచి చూడాల్సిందే.

● సీఎస్‌ఈకి తగ్గని క్రేజ్

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్‌ఈ)కు క్రేజ్ తగ్గనంటోంది. సాఫ్టవేర్, హార్డ్‌వేర్ ప్రక్రియల్లో సమాచార వ్యవస్థల డిజైన్, అమలు, నిర్వహణకు సంబంధించిన కోర్సు కాబట్టి దీనికే ఎక్కువగా జై కొడుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిశ్రమల్లో అధునాతన వ్యవస్థలు, ఆటోమెషన్ పురోగతి సీఎస్ ఈ రంగానికి డిమాండ్ పెంచింది. ఏఐ, బ్లాక్‌చెయిన్ వంటి అధునాతన టెక్నా లజీలు ప్రపంచ రూపురేఖలు మారుస్తుండటం, ప్రతి రంగంలో కంప్యూటర్ల వినియోగం ఉండడంతో సీఎస్‌ఈకి ఎంతో ప్రాధన్యత లభిస్తోంది. దీంతో పెద్ద కంపెనీల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొంది రూ.లక్షల్లో జీతాలు అందుకోవచ్చన్న ఆశతో విద్యార్థులు దీనికే మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో సీఎస్‌ఈలో 3972 సీట్లకు గాను తొలి విడతలో 2,672 సీట్లు భర్తీ అయ్యి ప్రథమస్థానంలో నిలవగా, ఈసీఈ, ఏఐఎంఎల్‌లు తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 25 జూలై 2025




శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ముక్కంటి ఆలయ ప్రక్షాళన

ఏడాదిలో ఏం చేశారు?

బలమైన రాజకీయ నేపథ్యమున్న కుటుంబం ఆయనది. తండ్రి వైపు తాత గంగసుబ్బరామిరెడ్డి శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా పనిచేయగా, తండ్రి గోపాలకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా చేశారు. తల్లివైపు తాత పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు. వాయల్పాడు ఎమ్మెల్యేగా, మంత్రిగా చేశారు. ఈ వారసత్వం అందిపుచ్చుకుని రాజకీయాల్లో అడుగుపెట్టారు బొజ్జల సుధీర్‌రెడ్డి. 2019 ఎన్నికల్లో శ్రీకాళహస్తి నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయినా రాజకీయాల్లో క్రియాశీలంగానే కొనసాగారు. 2014లో గెలిచి అసెంబ్లీలో తొలి అడుగుపెట్టారు. తొలి ఏడాది కాలంలో ఆయన శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటి? ప్రజలు ఆయన నుంచి ఏమి ఆశిస్తున్నారు? ఇంకా చేయాల్సినవి ఏమిటి? మలి ఏడాది లక్ష్యాలుగా వేటిని నిర్దేశించుకున్నారు... ఈ అంశాల సమాహారం... - వివరాలు 6లో -



మామిడితోట మారిందిలా..

ఛీ.. మామిడి!

● లాభాల్లేక ప్రత్యామ్నాయ పంటలపై రైతుల దృష్టి

పురుగులు, నకిలీ మందులే కారణం

ఇప్పుడు మామిడి పంట అధిక దిగుబడి వచ్చినా అందులో పురుగు లున్నాయి. పంటను నాశనం చేస్తున్నాయి. అనేక రకాల మందులు వాడినా ప్రయోజనం లేదు. దీనికి కారణం నకిలీ మందులే ఎక్కువగా ఉండటం. ఇక్కడ వాతావరణానికి అనుకూలంగా ఉండే. నిర్వహణ తక్కువ ఉండే పంటలను వేయాలని మామిడి చెట్లను తొలగించాం.

- ధనంజయులునాయుడు, ఎం.కొంగరవారిపల్లె

చంద్రగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మామిడికి ఈ ఏడాది గిట్టుబాటు ధరల్లేక రైతులు నష్టపోయారు. రేటు మాట అటుంచితే.. ఫ్యాక్టరీలకు తోతాపురి కాయలు తోలేందుకూ ఇబ్బంది పడ్డారు. ట్రాక్టర్లలో కాయలు లోడ్ చేసి.. పల్ప్ ఫ్యాక్టరీల వద్ద రోజుల తరబడి నిరీక్షిస్తూ, మరోవైపు కుళ్లిపోతున్న కాయలు చూసి ఆవేదన చెందారు.ఈ క్రమంలో పలువురు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడుతున్నారు.గతంలో అన్ని పంటలలో రారాజుగా మామిడి ఉండేది. కొన్నేళ్ల క్రితం మామిడి పంటల ద్వారా అధిక దిగుబడితో రైతులను ఆర్థిక పురోగతిని పెంచింది. ఇక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మామిడి పంటను ప్రోత్సహించాయి. ఇలా జిల్లాలో మామిడి సాగు పెరిగింది. గత కొన్నేళ్లుగా మామిడిలో లాభాలు అంతగా రాలేదు. వచ్చే సంవత్సరమైనా లాభాలు రాకపోతాయా అంటూ .. ఎప్పటికప్పుడు ఎదురు చూస్తూ వచ్చారు. అయితే, ఈ ఏడాది తోతాపురి పంట దిగుబడి గణనీయంగా పెరిగింది. దీంతో పంట విక్రయించలేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీసం గిట్టుబాటు ధర కూడా లేక చాలామంది అప్పుల పాలయ్యారు. ఈ క్రమంలో మామిడి పంటపై ఆశలు వదులుకున్నారు. ఎన్నో ఏళ్లుగా మామిడి చెట్లను కాపాడుకొంటూ వస్తున్న రైతుల్లో.. పలువురు ఇప్పుడు చెట్లను నరికేస్తున్నారు. చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లెకు చెందిన ధనంయజయ నాయుడికి ఏడు ఎకరాలు మామిడి చెట్లున్నాయి.పాశం గోపాల్‌నాయుడు మూడు ఎకరాలు, ముంగిలిపట్టుకు చెందిన మునిశేఖర్‌నాయుడు రెండున్నర ఎకరాలలో మామిడి సాగు చేశారు. మామిడిలో లాభాలు లేకపోవడంతో చెట్లను తొలగిస్తున్నారు. వీటి స్థానంలో కొబ్బరి చెట్లు, లేదా అంతర పంటలు, లేక పొట్టేలు.. కోళ్ల ఫారం, డెయిరీ ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు.



నరికేసిన చెట్లను ట్రాక్టర్‌లో తరలిస్తూ..

శుభాల శ్రావణం



● నేటి నుంచి ప్రారంభం

తడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీ నారాయణులకు ప్రీతికరమైన శ్రావణ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెలలో చేసే పూజలు అత్యంత విశిష్టమైనవని హిందువుల నమ్మకం. శివకేశవులను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. శ్రావణ సోమవారం, శ్రావణ మంగళవారం, శ్రావణ శుక్రవారం, శనివారం ఇలా ఈ నెలలో ప్రతి రోజూ విశిష్టత గలవే. అందుకనే ఈ నెలను ఆధ్యాత్మిక మాసమని అంటారు. శ్రావణమాసం మహిళలకు ఎంతో పవిత్రమైన మాసం. ఎందుకంటే మహిళలు చేసే వ్రతాలలో ఎక్కువగా ఈనెలలోనే ఉంటాయి.

నెలవారీ ముహూర్తాలు

జూలై: 26, 30, 31 తేదీలు.
ఆగస్టు: 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17.
సెప్టెంబరు: 24, 26, 27, 28.
అక్టోబరు: 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31.
నవంబరు: 1, 2, 7, 8, 12, 13 15, 22, 23, 26, 27, 28, 30.

● డిసెంబరు 8 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 6వ తేది వరకు దాదాపు రెండు నెలలపాటు ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు.

పండుగలకు 'నెల'వు

శ్రావణ మాసంలో అనేక పండుగలు వస్తున్నాయి. ఈ నెల 25న తొలి శుక్రవారం, ఆగస్టు 8న వరలక్ష్మీ వ్రతం, 9న రాఖీ, జంధ్యాల పౌర్ణమి వేడుకలు, 16న శ్రీకృష్ణాష్టమి వంటి ముఖ్యమైన పండుగలున్నాయి.22న ఐదో శుక్రవారంతో శ్రావణ మాసం ముగుస్తుంది. శ్రావణం పూర్తయిన వెంటనే బాద్రపద మాసంలో 27న వినాయక చవితి వస్తుంది.

పెళ్లిళ్ల సీజన్

మే నెలతో ముహూర్తాలు ముగియడంతో వివాహాలు, శుభ కార్యాలయాలకు విరామం వచ్చింది. ఇక, శ్రావణ మాసం మొదలుతో పెళ్లిళ్ల సీజన్ వచ్చేసినట్లే. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ కల్యాణ మండపాలను సిద్ధం చేస్తున్నారు. ఇక, గృహ ప్రవేశాలు, గృహ నిర్మాణానికి భూమిపూజ, నామకరణం వంటి అనేక శుభకార్యాలూ జరగనున్నాయి.

టీటీడీ ఉద్యోగిపై వెంకటగిరి ఎమ్మెల్యే ఫైర్

● మహద్వారం గేటు తీసేందుకు నిరాకరించడంతో ఆగ్రహం



ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్యే

తిరుమల, జూలై24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ మహద్వారం వద్ద వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ టీటీడీ ఉద్యోగిపై విరుచుకుపడ్డారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుని మహద్వారం గుండా ఎమ్మెల్యే వెలుపలకు వచ్చారు. ఆయన వెనుక ఉన్న అనుచరులను అదే దారిలో బయటకు పంపేందుకు గేటు వద్ద విధుల్లోవున్న ఉద్యోగి నిరాకరించారు. తాను ఎమ్మెల్యేనని రామకృష్ణ చెప్పినప్పటికీ గేటు తీయలేదు. పుష్కరిణి వైపు ఉన్న మార్గం ద్వారా బయటకు వెళ్లాలని ఆ ఉద్యోగి సూచించారు. దీంతో ఎమ్మెల్యేకి, ఉద్యోగికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇంతలో ఆలయ అధికారులు జోక్యం చేసుకుని గేటు తెరిపించి వెలుపలకు పంపారు.

ఇలా.. జాతిపిత



● అనుమతిలేకనే గాంధీ విగ్రహం కూల్చివేత
● శ్మశానంలో పడేసిన ఛోటా నేతలు

గ్రామంలో 60 ఏళ్లపాటు ఠీవిగా ఉన్న జాతిపిత విగ్రహం.. గురువారం సాయంత్రం ఇలా శ్మశానం వద్ద పడుంది. అధికారుల అనుమతి లేకుండా కూలగొట్టి.. భవన వ్యర్థాల మధ్య పడేయడంపై గ్రామస్తులు ఆవేదన.. ఆగ్రహం వ్యక్తంచేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయుడుపేట మండలం పుదూరులో ఆరు దశాబ్దాల నాటి గాంధీ విగ్రహం స్వల్పంగా శిథిలావస్థకు చేరింది. దీంతో కొత్త విగ్రహం ఏర్పాటుకు ఈ నెల 19న పంచాయతీలో తీర్మానించారు. అంతే.. గురువారం మధ్యాహ్నం కొందరు చోటా నాయకులు గాంధీ విగ్రహన్ని పగలగొట్టి.. శ్మశానంలో భవన నిర్మాణ శిథిలాల వద్ద పడేశారు. సాయంత్రం కొందరు చూసేసరికి గాంధీ విగ్రహం స్థానంలో చదును చేసేసి ఉంది. విగ్రహం ఎక్కడ ఉందంటూ ఆరా తీయగా.. శ్మశానం వద్ద కనిపించింది. 'ఈ నెల 19న గాంధీ విగ్రహం కొత్తగా ఏర్పాటు చేసేందుకు మాత్రమే పంచాయతీ తీర్మానం చేసింది. విగ్రహం పడగొట్టడం కోసం మా అనుమతులు తీసుకోలేదు. ఈ విషయాన్ని పై అధికారులకు తెలిపాం' అని పంచాయతీ కార్యదర్శి జి.వెంకటరావు తెలిపారు.

- నాయుడుపేట టౌన్

ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీలో శ్రీసిటీకి ప్రాధాన్యం

● తిరుపతిలో మరో ఫైవ్ స్టార్
● 'గ్రీన్‌ల్యామ్' విస్తరణకు ప్రోత్సాహకాలు
● మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీలో శ్రీసిటీకి ప్రాధాన్యం లభించనుంది. అమరావతిలో గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో జిల్లాకు సంబంధించీ ఉన్నాయి. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ వస్తువుల తయారీ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఏపీ ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ 4.0 (2025-30)ని మంత్రివర్గం ఆమోదించింది. ఈ పాలసీలో భాగంగా దేశంలోనూ, ప్రపంచ స్థాయిలోనూ పెద్ద ఎత్తున పెట్టుబడులను, ఎలక్ట్రానిక్స్ భాగాల పర్యావరణ వ్యవస్థను ఉత్తేజితం చేయనుంది. దీనివల్ల శ్రీసిటీలో పెట్టుబడి పెట్టే ఎలక్ట్రానిక్ భాగాల తయారీ కంపెనీలు ముందస్తు ప్రోత్సాహకాలు, మ్యాచింగ్ ప్రోత్సాహకాలు, మధ్యంతర మద్దతు వంటివి ప్రభుత్వం నుంచీ పొందనున్నాయి. వీటన్నింటి వల్ల శ్రీసిటీలో ఎలక్ట్రానిక్స్ విడి భాగాల తయారీ పరిశ్రమలు మరిన్ని ఏర్పాటై ఉద్యోగాల కల్పనకు గణనీయంగా అవకాశాలు ఏర్పడనున్నాయి.

● నాయుడుపేట పారిశ్రామికవాడలో ఇప్పటికే రూ.1150 కోట్ల పెట్టుబడితో 1800 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన మెస్సర్స్ గ్రీన్ ల్యామ్ లిమిటెడ్ సంస్థ పరిశ్రమను విస్తరించే ప్రయత్నాల్లో వుంది. దీనికి కూడా ఈనెల 17న జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో చేసిన సిఫారసులను మంత్రివర్గం ఆమోదించింది.

● ఇప్పటికే తిరుపతి, పరిసరాల్లో అనేక ఫైవ్ స్టార్ హోటళ్లు ఏర్పాటవుతున్న నేపధ్యంలో తాజాగా మరో సంస్థకు మంత్రివర్గం అనుమతిచ్చింది. బెంగళూరుకు చెందిన మెస్సర్స్ స్టార్టర్స్ ఎల్ఎల్‌పీ సంస్థ తిరుపతిలో ఫైవ్ స్టార్ హోటల్ ఏర్పాటుకు ముందుకురాగా భూమి, రాయితీలు ఇచ్చేందుకు మంత్రివర్గం అంగీకరించింది.

భార్యపై అనుమానంతో

ఫీల్డ్ అసిస్టెంట్ ఇంటికి నిప్పు

రేణిగుంట జూలై 24 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను హత్య చేయాలని భావించాడు. బంధువులతో కలిసి గురువారం తెల్లవారుజామున దొడ్లమిట్టలోని అతడి ఇంటికి నిప్పు పెట్టారు. ఇంట్లో ఉన్న నవీన్ అప్రమత్తం కావడంతో బయటపడ్డారు. సీఐ జయచంద్ర తెలిపిన ప్రకారం.. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్టలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద స్థానికంగా 200 మంది కూలీలు పని చేస్తున్నారు. వీరిలో ఒక మహిళతో నవీన్‌కు వివాహేతర సంబంధం ఉందని ఆమె భర్తకు అనుమానం. దీంతో అతడు నవీన్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున 2 గంటలకు తన అన్న, అక్కతో కలిసి ఆ మహిళ భర్త రామాంజనేయులు.. నవీన్‌ను సజీవంగా దహనం చేసేందుకు అతడి ఇంటి చుట్టూ పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఇంటికి మంటలు అంటుకోవడంతో నిద్రలో ఉన్న నవీన్ తేరుకొని బయటకు వచ్చి కేకలు వేయడంతో స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఏసీ, ఇంట్లోని ముఖ్యమైన పరికరాలు కాలిపోగా, 70 శాతం ఇల్లు దగ్ధమైందని సీఐ తెలిపారు. బాధితుడు నవీన్ ఫిర్యాదు మేరకు రామాంజనేయులు, ఆదినారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



దొడ్లమిట్టలో ఇంటికి నిప్పు పెట్టడంతో కాలిపోయిన ఇల్లు

టీటీడీ అన్నప్రసాద ట్రస్టుకు రూ.2 కోట్ల విరాళం



తిరుమల, జూలై24(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన ట్రినిటీ కంబైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గురువారం రూ.2 కోట్లు విరాళంగా అందజేసింది. ఆ సంస్థ ప్రతినిధులు ఈ చెక్కులను ఆలయంలోని రంగనాయక మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 24(ఆంధ్రజ్యోతి): 'పేదరిక నిర్మూలన దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కండి. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోండి' అంటూ పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలకు కలెక్టర్ వెంకటేశ్వర్ విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో వర్చువల్ విధానంలో మాట్లాడారు. శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని పరిశ్రమల ప్రతినిధులు ఆయా ప్రాంతాల్లోని కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు.



ఆగమోక్తంగా ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి, జూలై 24: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన వళ్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆగమోక్తంగా ధ్వజావరోహణ కార్యక్రమం జరిగింది. ఆలయంలోని చెంగల్వరాయ సన్నిధి వద్ద స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ధ్వజావరోహణ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా, అంతకుముందు వసంతోత్సవం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముక్కంటి ఆలయంలోని వసంత మండపం వద్ద ఈ వేడుకను నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లు కేడిగ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. శుక్రవారం రాత్రి పల్లకీసేవ జరగనుంది.

ధ్వజావరోహణం పూజలు చేస్తున్న వేదపండితులు

బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న మహారథం

తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2 వరకు జరుగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలయ్యాయి. శ్రీవారి మహారథం(చెక్కతేరు)ను సిద్ధం చేసే పనులు సాగుతున్నాయి. మరోవైపు ఆలయ మహద్వారం గేట్లను వివిధ రసాయనాలతో శుద్ధి చేస్తున్నారు. ఇక పుష్కరిణి మరమ్మతు పనులు కూడా వేగంగా సాగుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

చెక్క తేరును సిద్ధం చేస్తున్న సిబ్బంది



సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని రెండు షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.55 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,130

తలనీలాలు సమర్పించినవారు: 26,786



కథనం, ఇంటర్వ్యూ : తిరుపతి, ఆంధ్రజ్యోతి

పట్టాలెక్కుతున్న మాస్టర్ ప్లాన్

ఏడాదిలో ఏం చేశారు?

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి



ఆధ్యాత్మిక క్షేత్రమే కాదు, రాజకీయంగానూ ప్రాధాన్యంగల నియోజకవర్గం శ్రీకాళహస్తి. తాతలు వేసిన బాట.. తండ్రి చూపిన తోవ.. తల్లి చేదోడుతో రాజకీయాల్లో అడుగులు వేస్తున్నారు బొజ్జల సుధీర్‌రెడ్డి. శ్రీకాళహస్తి అభివృద్ధికి అనేక పనులను భుజాలకెత్తుకున్నారు. స్థానికంగానే నివాసముంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. అధికారుల సమక్షంలో ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశిస్తున్నారు. మండలాల వారీగా టోల్‌ఫ్రీ తరహాలో ఫోన్ నంబర్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేగా దూకుడు ఎక్కువ అనే ముద్రను తొలి ఏడాదిలోనే తుడుపుకోగలిగారు. తొలి ఏడాది శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ఆయన చేసినవీ, చేస్తున్నవీ, చేయాలనుకుంటున్నవీ.. ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు..

రూ. 35 కోట్లతో చేసిన పనులు

- తాగునీటి సమస్య వున్న గ్రామాల్లో 70 బోర్లు తవ్వించారు.



ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిమ్

- శాప్ నిధులతో ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ. అందులో జిమ్, షటిల్ కోర్టు ఏర్పాటు.



శ్రీకాళహస్తి ఈద్గాలో పనులు

- శ్రీకాళహస్తిలో ఈద్గా పునరుద్ధరణ. పెద్ద ఈద్గాలో ల్యాంకో సీఎస్ఆర్ నిధులతో మినార్ నిర్మాణం.
- ఉపాధి హామీ కింద రూ. 12.64 కోట్లతో పనులు
- ఆర్ అండ్ బీ ద్వారా రూ. 1.71 కోట్లతో పనులు
- ఇరిగేషన్ శాఖ ద్వారా రూ. 3.82 కోట్లతో పనులు
- శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో రూ. 3.37 కోట్లతో పనులు.
- ఎంపీపీ 15వ ఆర్థిక సంఘం పీఎఫ్ఎంఎస్, సీఎఫ్ఎంఎస్ నిధులతో 10.82 కోట్లతో వివిధ పనులు.

పక్కా ఇళ్లకు స్పెషల్ డ్రైవ్: యువగళం పాదయాత్రలో పక్కా ఇళ్లకు, ఇళ్ల స్థలాలకు 59 వేల అర్జీలు వచ్చాయి. అర్హులను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం. ఇప్పటి వరకూ 15 వేల మందిని గుర్తించాం. డీకేటీ భూములు సేకరించి అందరికీ స్థలాలిస్తాం.

పారిశ్రామిక వరం: మన్నవరంలోని ఎన్టీపీసీ-భెల్ పరిశ్రమకు 50 ఎకరాలు మాత్రమే వుంచి మిగిలిన 700 ఎకరాలు వెనక్కు తీసుకున్నాం. ఇక్కడ హెలికాప్టర్ విడి భాగాల తయారీ పరిశ్రమ వచ్చే అవకాశముంది. రిలయన్స్, కార్డ్ బోర్డ్, ఫినోలెక్స్ వంటి మరో ఎనిమిది పరిశ్రమలను రప్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. గడ్డి పెంచడానికి, వెదురు ప్లాంటేషన్ కోసం గ్రీన్ కంపెనీ ఏర్పాటుకు యత్నిస్తున్నాం. దీనికి 30 వేల ఎకరాలు కావాలి.



ఈట్ స్ట్రీట్ తరహాలో జరుగుతున్న స్వర్ణముఖి నది కరకట్ట పనులు

ప్రోగ్రెస్ రిపోర్ట్

ఇచ్చిన హామీలు

- నియోజకవర్గంలో 40 నుంచి 50 వేల మందికి పక్కా ఇళ్ళు
- తండ్రి ప్రారంభించిన ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్ పూర్తి చేయడం
- గుడిమల్లం, తొండమనాడు, శ్రీకాళహస్తి ఆలయాలు కలుపుతూ టెంపుల్ టూరిజం సర్క్యూట్.
- ముక్కంటి ఆలయంలో స్థానికులకు ఉచితంగా ప్రత్యేక దర్శనం
- స్కిట్ కళాశాల పునఃప్రారంభం
- స్వర్ణముఖి ప్రక్షాళన
- మెడికల్ కళాశాల ఏర్పాటు
- స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు
- మండలానికో ఎంఎస్ఎంఈ పార్కు... మహిళలకు ఉపాధి
- ఎస్ఎస్ కెనాల్, బాలాజీ రిజర్వాయర్ పూర్తి
- కన్నలి కాలువ, చెంబేడు కాలువల ప్రక్షాళన. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ.
- ఆటోనగర్ ఏర్పాటు.

చేసిన పనులు

- ఆలయంలో దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపాం. ఇరవై ఏళ్ళుగా ఆలయంలో పాతుకుపోయిన వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించా. మునుపు రోజువారీ రూ. 75 లక్షలు దాటని ఆలయ ఆదాయం ఇపుడు రూ. కోటి దాటుతోంది. ఆలయ పైకప్పునకు వాటర్ ప్రూఫ్ చేశాం. ఇదివరకూ పది వేల మందికి పెట్టే అన్న వితరణను 20 వేల మందికి పెంచాం.
- రూ. 55 లక్షల వ్యయంతో కన్నలి కాలువ పూడిక తీయించా.
- రేణిగుంట మండలం గాజులమండ్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రెండు నెలల కిందట సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. ఇటీవలే మెగా జాబ్ మేళా నిర్వహించాం. 1788 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 712 మందికి అక్కడికక్కడే నియామకపుటుత్తర్వులు అందజేశారు.
- శ్రీకాళహస్తి, రేణిగుంటల్లో విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచీ కాపాడాం. శ్రీకాళహస్తి రాజీవ్ నగర్‌లో ప్రధాన రోడ్డు పక్కన 106 నిర్మాణాలు, లోపలి వైపు 82 నిర్మాణాలు అక్రమమని తేల్చి కూల్చివేయించాం. రేణిగుంటలో 90 అక్రమ నిర్మాణాలు కూలగొట్టించాం. మొత్తం 278 అక్రమ నిర్మాణాలు తొలగించాం.



రాజీవ్‌నగర్‌లో కూల్చిన అక్రమ నిర్మాణాలు

- శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని రూ. 35 లక్షల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేశాం. పిడియాట్రిక్ ఐసీయూ నిర్మాణంలో వుంది. మెటర్నిటీ వార్డులో మెకానికల్ బెడ్లు ఏర్పాటు చేశాం. డయాలసిస్ యూనిట్ ప్రక్షాళన చేస్తున్నాం. ఆస్పత్రి అభివృద్ధికి అపోలో సంస్థతో చర్చిస్తున్నాం.



ఎమ్మెల్యే సొంత నిధులతో అభివృద్ధి చేసిన శ్రీకాళహస్తిలోని రెండో నెంబరు బాలిక వసతిగృహం

- ప్రభుత్వం ఇచ్చిన రూ. 40 లక్షలకుతోడు రూ.90 లక్షలు సొంత నిధులు వెచ్చించి శ్రీకాళహస్తిలోని నాలుగు హాస్టళ్ళలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచాం.
- రేణిగుంట నుంచీ షిర్డీ, వారణాసి లకు అలాగే కువైట్, చైనా, దుబాయ్ లకు విమాన సర్వీసులు నడపాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరాను. ఏడాదిలోపు ఇవి జరిగే అవకాశముంది.
- గెలిచిన వెంటనే ఢిల్లీకి వెళ్ళి రైల్వే మంత్రిని కలసి శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు కోరా. మంజూరయ్యాయి. పనులు కూడా మొదలయ్యాయి.

మలి ఏడాది లక్ష్యాలు!

- ఏర్పేడులో శాశ్వత ప్రాతిపదికన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. దానికోసం 48 ఎకరాలు గుర్తించాం. ఈ ఏడాదిలోనే పనులు ప్రారంభమవుతాయి.
- తొట్టంబేడు మండల పరిధిలో రెండు మూడు నెలల్లోనే ఆటోనగర్ ఏర్పాటవుతుంది.
- నియోజకవర్గంలో వరి, వేరుశెనగ పంటల సాగు ఎక్కువ. ప్రైవేట్ పబ్లిక్ పార్ట్నర్‌షిప్ కింద గోదాముల నిర్మాణానికి ప్రయత్నిస్తున్నా. మండలానికి ఐదు గోదాములు చొప్పున నిర్మించాలని ఆలోచన.

ఇవి చేయాలి.. చేస్తా!

- బాలాజీ రిజర్వాయర్‌కు సమయం పడుతుంది. దీనికి భారీగా నిధులు అవసరం. సీఎం చంద్రబాబు స్వయంగా రిజర్వాయర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.
- చెంబేడు కాలువ 24 కిలోమీటర్ల వరకూ ఆక్రమణలకు గురైంది. పూడిపోయింది. దీన్ని పునరుద్ధరించడానికి సాయం చేయాలని సీఎంను కోరా.
- సీఎం కరుణిస్తేనే మెడికల్ కాలేజీ కూడా వస్తుంది.

సోమశిల-స్వర్ణముఖి కెనాల్‌పై అసెంబ్లీలో : పెండింగ్ పనులు పూర్తి చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించా. కేవలం నాలుగైదు ఎకరాల అటవీ భూములకు కేంద్ర అటవీ శాఖ అనుమతి రావాలి. చొరవ తీసుకోవాలని సీఎం చంద్రబాబును కోరా.

ప్రజల ప్రశ్నలు - ఎమ్మెల్యే జవాబులు



? ఎమ్మెల్యే గారూ.. శ్రీకాళహస్తి ఆలయాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని ఎన్నికల్లో మీరు హామీ ఇచ్చారు. అమలు చేయండి.

- పత్రి మురళి, చిల్లర దుకాణం యజమాని, శ్రీకాళహస్తి

! మా తండ్రి గోపాలకృష్ణారెడ్డి రూపొందించిన మాస్టర్ ప్లాన్ గత ప్రభుత్వం నిర్వాకంతో పెండింగు పడింది. ఒక డమ్మీ ఆర్కిటెక్‌ను పెట్టి రూ. 70 లక్షలు దుర్వినియోగం చేశారు. ప్రభుత్వ ఆర్కిటెక్ట్ ద్వారా ప్లాన్ అమలుకు చర్యలు మొదలుపెట్టాం. ఆలయానికి ఆనుకునివున్న 128 ఎకరాల దేవస్థానం భూములున్నాయి. కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు అక్కడ భక్తుల సముదాయాలు నిర్మించేందుకు అంగీకరించాయి. ఇక తిరుపతి ఐఐటీ సహకారంతో ముక్కంటి ఆలయంలో పాలన, నిర్వహణ మొత్తం ఒక గొడుగు కిందకు తెచ్చేలా ఒక వ్యవస్థను అమల్లోకి తెస్తాం. మాస్టర్ ప్లాన్ అమలుకు రూ. 280 కోట్లు అవసరమవుతుంది. అన్నింటినీ ఆరునెలల్లో కొలిక్కి తెచ్చి పనులు ప్రారంభిస్తాం.

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



? స్వర్ణముఖి నదిని ప్రక్షాళన చేస్తామని, నది కరకట్టను అభివృద్ధి చేస్తామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారని గుర్తు చేస్తున్నాను ఎమ్మెల్యేగారూ.

- వెలంపాటి కృష్ణ, వంట మాస్టర్, కాసరం గ్రామం

! ఆలయంతో ముడిపడివున్న స్వర్ణముఖి పవిత్రతను కాపాడుతునే యూరోపియన్ తరహాలో అభివృద్ధి పరుస్తాం. నది కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నాం. ఈట్ స్ట్రీట్ తరహాలో అభివృద్ధి చేస్తాం. నెల రోజుల్లోనే వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి రాబోతోంది.

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



? శ్రీకాళహస్తిలో ప్రతిష్ఠాత్మకమైన స్కిట్ కళాశాల మూతపడింది. గెలిస్తే తిరిగి తెరిపిస్తామని ఎన్నికల్లో మీరు హామీ ఇచ్చారు. ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది.

- డాక్టర్ వెంకటరామన్, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, శ్రీకాళహస్తి

! ఏ హామీ కూడా వదిలేయను. స్కిట్‌ను తెరిపిస్తున్నాం. రూ.5 కోట్లతో అవసరమైన పనులు చేపట్టాం. ఆలయ నిర్వహణలోనే వుంచి లీజుపై కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నాం. రెండు నెలల్లో మంత్రి నారా లోకేశ్ ద్వారా అడ్మిషన్లకు కౌన్సిలింగ్ నిర్వహించి తరగతులు ప్రారంభిస్తాం.

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీవారి సేవలో ప్రముఖులు



డీవీజీ శంకర్రావు - శంకర్ జీవాల్ - రఘు

తిరుమల, జూలై24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకర్రావు, తమిళనాడు డీజీపీ శంకర్ జీవాల్, సినీనటుడు రఘు ఉన్నారు.

శ్రీసిటీలో నైట్రోజన్ గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు

- నోవా ఎయిర్‌తో ఒప్పందం

సత్యవేడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటులో భాగంగా నోవా ఎయిర్ టెక్నాలజీస్‌తో యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు నోవా ఎయిర్ సంస్థ సొంతంగా పైప్‌లైన్ వ్యవస్థ, ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణ చేపట్టనుంది. శ్రీసిటీలో పారిశ్రామిక అవసరాలకు అంతరాయం లేకుండా దశలవారీగా ఈ ప్రాజెక్టు అమలుకానుంది. శ్రీసిటీని పారిశ్రామిక మౌళిక సదుపాయాలకు ఉత్తమ నమూనాగా మార్చే ప్రయాణంలో నోవా ఎయిర్‌తో భాగస్వామ్యం మరో ముందడుగుగా శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి ఆవిష్కరణ, సుస్థిరత, ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందించాలన్న తమ నిబద్ధతను ప్రతిబింబిస్తోందని తెలిపారు. ఈ ఒప్పందం పట్ల నోవా ఎయిర్ టెక్నాలజీస్ ఎండీ అండ్ సీఈవో గజానన్ సబార్ సంతోషం వ్యకం చేశారు. అభివృద్ధి చెందిన దేశాలలోని సెజ్‌లకు పరిమితమైన యుటిలిటీ పైప్‌లైన్ నెట్‌వర్క్ సదుపాయం భారతదేశంలో ఈ తరహా చొరవ ఇదే ప్రథమం కావచ్చని వ్యాఖ్యానించారు.

28, 29 తేదీల్లో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

తిరుపతి అర్బన్, జూలై 24: తిరుపతి రూరల్ తుమ్మలగుంట మైదానంలో 28, 29 తేదీల్లో బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్ ఓ ప్రకటనలో తెలిపారు. '28న అండర్ 14, 16 బాలబాలికలకు, 29న అండర్ 8, 20 బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయి. వీటిలో ఎంపికైన వారు వచ్చేనెల 9నుంచి 11వరకు జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారు. ఆసక్తిగల క్రీడాకారులు ధ్రువీకరణ పత్రం, ఆధార్ తీసుకురావాలి. మరిన్ని వివరాలకు 86868 67079 నెంబరులో సంప్రదించాలి' అని ఆ ప్రకటనలో కోరారు.

టీటీడీలో అంటరానితనం బాగా కనిపిస్తోంది

- అన్యమతం పేరుతో దళితులను ఇబ్బంది పెడుతున్నారు
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న చింతా మోహన్ తదితరులు

చిత్తూరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో అంటరానితనం బాగా కనిపిస్తోందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. చిత్తూరులోని గాంధీ విగ్రహం ఎదుట గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో టీటీడీలో ఉన్నతాధికారులుగా దళితులు పనిచేశారన్నారు. ఇప్పుడు కనీసం ఒక్కరు కూడా కనిపించడం లేదని విమర్శించారు. కొండపైన వందలాది అంగళ్లలో ఒక్క ఎస్సీ, ఓబీసీ లేకపోవడం గమనార్హమన్నారు.ఇటీవల టీటీడీలో అన్యమతం పేరుతో దళితులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను మూసివేసి, మధ్యాహ్న భోజనం నిలిపివేసి పేద విద్యార్థులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు.బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ 11 ఏళ్లలో రూ.14.5 లక్షల కోట్ల దాకా బ్యాంకు రుణాలను మాఫీ చేసిందని, అయితే లబ్ధిదారులందరూ కోటీశ్వరులేనని తెలిపారు. మాఫీ అయిన రుణాల్లో సుమారు రూ.లక్ష కోట్లు బీజేపీ వసూలు చేసుకుందని ఆరోపించారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు చిత్తూరు జిల్లా వాసి అయినా చిత్తూరును అభివృద్ధి చేయలేదన్నారు.

- సమీక్షలు- సమావేశాలు

వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జులై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టి, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. సాధ్యమైనంత త్వరగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, బీసీ, గిరిజన జిల్లా సంక్షేమాధికారులు భరత్‌కుమార్‌రెడ్డి, రాజా సోము, మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్తలు రేష్మ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.


2029 నాటికి వందశాతం అక్షరాస్యత

జిల్లాలో 'ఉల్లాస్- అక్షరాంధ్ర' కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తూ 2029 నాటికి వందశాతం అక్షరాస్యత సాధించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 12,085 మంది వయోజనులను లక్ష్యంగా పెట్టుకున్న కార్యక్రమం విజయవంతమైందని గుర్తుచేశారు. అదేవిధంగా ఈ ఏడాది 88,687మంది నిరక్షరాస్యులను లక్ష్యంగా పెట్టుకుని బోధన తరగతులు నిర్వహించాలన్నారు. 15-59 ఏళ్ల వారికి చదవడం, రాయడం, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత వంటి అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. దీనికోసం ఆగస్టు 7న అక్షరాస్యత కేంద్రాలు ప్రారంభించాలని వయోజనవిద్యాశాఖ అధికారి మహమ్మద్ అజాద్‌ను ఆదేశించారు. వయోజనశాఖ నోడల్ అధికారి ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, మెప్మా పీడీ రవీంద్ర, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీఈవో కేవీఎన్ కుమార్, ఐసీడీఎస్ పీడీ వసంత బాయి తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్ర సెంట్రల్ వర్సిటీ పాఠ్యాంశంగా

'పల్లిపట్టు' రచన యాలైపూడ్సింది

సత్యవేడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కవి పల్లిపట్టు నాగరాజు రచించిన 'యాలైపూడ్సింది' కవితా సంపుటికి అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్రప్రదేశ్ కేంద్రియ విశ్వవిద్యాలయం ఎంఏ తెలుగు ఆధునిక కవిత్వ విభాగంలో తెలుగు విద్యార్థులకు రెండవ సెమిస్టర్‌లో 'యాలైపూడ్సింది' కవితా సంపుటిని పాఠ్యాంశంగా చేర్చారు. సత్యవేడు మండలం రంగనాథపురం గ్రామానికి చెందిన పల్లిపట్టు నాగరాజు రాసిన కవితల సంపుటి 'యాలైపూడ్సింది'కి 2022లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. సమకాలీన వాస్తవికతను ప్రతిబింబిస్తూ, రాయలసీమ గ్రామీణ మాండలికంలో రాసిన 52 కవితల సంపుటి నాగరాజు తొలి రచన కావడం విశేషం. దళిత, బహుజన, గిరిజన కుటుంబాల జీవనశైలిలోని సౌందర్యాన్ని, శ్రామిక తత్వాన్ని, అట్టడుగు బతుకుల అగచాట్లను ఈయన కవితలుగా రాశారు. ఈ పుస్తకం ఉమ్మడిశెట్టి సాహిత్య అవార్డు వంటి ఎనిమిది అవార్డులను పొందింది. పల్లిపట్టు నాగరాజు ప్రస్తుతం వరదయ్యపాళెం జడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.



పల్లిపట్టు నాగరాజు



రాయలసీమకు దక్కిన గౌరవం

యాలైపూడ్సింది కవితా సంపుటిని ఎంఏ విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టడం చాలా సంతోషంగా, గౌరవంగా ఉందని పల్లిపట్టు నాగరాజు అన్నారు. ఇది అట్టడుగు కుటుంబాల, గ్రామీణ జీవితాలకు, వారి భాషకు ముఖ్యంగా రాయలసీమ మాండలికానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గూడూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గ పరిధిలోని బాధితులకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. 20 మంది లబ్ధిదారులకు వైద్యఖర్చుల నిమిత్తం రూ. 14.73 లక్షలు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, జానకిరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జలీల్ అహ్మద్, పురుషోత్తంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్‌రహీం పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు గుర్రంజాషువా



గుర్రంజాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆదర్శప్రాయుడు గుర్రంజాషువా అని సీపీఎం నాయకులు అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో గుర్రంజాషువా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, శివకుమార్, చంద్రయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, బాలరాజు, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

చిల్లకూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై పొదుపు సంఘాల సభ్యులకు గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం రత్నయ్య ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ గ్రామాలలో మౌలికవసతుల కల్పనకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు జీవనోపాధికి తోడ్పాటు, అంటరానితనం, బాల్యవివాహాలను నిర్మూలించడం వంటి అంశాలపై ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పేదరికాన్ని తగ్గించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు సుబ్రమణ్యం, పరశురామయ్య, వెంకటసుబ్బయ్య, రాగమ్మ, ఫకీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం



గూడూరు అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు గ్రామంలో గురువారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో ఓ గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. గిరిజనకాలనీ చెందిన శివ అనే యువకుడు అతని చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతిచెందడంతో కుటుంబభారాన్ని మోస్తూ ఇబ్బందులు పడుతున్నాడు. శివ తన ఇద్దరు తమ్ముళ్లను, చెల్లెలను పోషిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాబు, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ పోలీసు స్టేషన్ ప్రారంభం



తడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ తూర్పు వైపున పునరుద్ధరణ చేసిన ఆర్‌పీఎఫ్ పోలీసు స్టేషన్ భవనాన్ని గురువారం ఐజీ ఈశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సూళ్లూరుపేటలో అధునాతన వసతులతో కూడిన ఆర్‌పీఎఫ్ పోలీసుస్టేషన్‌ను సిబ్బందికి అందుబాటులో తెచ్చామన్నారు. విధుల్లో ఉండే సిబ్బందికి మహిళలు, పురుషులకు వేర్వేరుగా వసతులు కల్పించామన్నారు. చెన్నై నుంచి సూళ్లూరుపేటకు ఎస్కార్టుగా వచ్చే ఆర్‌పీఎఫ్ పోలీసులు, సూళ్లూరుపేట నుంచి చెన్నైకి వెళ్లే సిబ్బందికి విశ్రాంతి తీసుకునేలా వసతులు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం విశ్వనాథ్, డీఎస్పీ రామకృష్ణ పాల్గొన్నారు.

నార్త్‌గిరిజన కాలనీలో 'తొలి అడుగు'



కోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణ పరిధిలోని నార్త్‌గిరిజన కాలనీలో గురువారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు గిరిజన కాలనీలో ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కోటేశ్వరరావు, ఎంపీటీసీ దారా సురేష్, నౌషాద్, తూపిలి రాధాకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఇసుక తరలింపులో ఘర్షణ

● దళితుడిపై ఇసుక మాఫియా దాడి



ఇసుక మాఫియా దాడిలో గాయపడిన శ్రీహరి

ఓజిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ పరిధిలోని పాపిరెడ్డికండ్రిగకు చెందిన దళితుడు పులగూర శ్రీహరిపై అదే పంచాయతీ పరిధిలోని జోస్యులవారికండ్రిగకు చెందిన ఇసుక మాఫియా గురువారం దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. పోలీసుల కథనం మేరకు.. పాపిరెడ్డికండ్రిగకు చెందిన శ్రీహరి గురువారం ఉదయం తన ఇంటి నిర్మాణంలో భాగంగా ఇసుక కోసం జోస్యులవారికండ్రిగ సమీపంలోని స్వర్ణముఖి నది వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న ఇసుక మాఫియా అతడిని అడ్డుకున్నారు. దీంతో శ్రీహరి వారితో 'నా ఇంటి అవసరాలకు ఇసుక తీసుకు వెళుతున్నాను... మీలా పరిశ్రమలకు తరలించడంలేదు' అని మాట్లాడారు. దీంతో రెచ్చిపోయిన ఇసుక మాఫియా అతడిపై దాడిచేశారు. ఈదాడిలో శ్రీహరి తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్సకోసం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెలరేగిపోతున్న ఇసుక మాఫియా

ప్రభుత్వం గృహ అవసరాలకు ఇసుకను ఉచితంగా తరలించేందుకు అనుమతించడాన్ని ఇసుక మాఫియా అవకాశంగా మలచుకుంటోంది. జోస్యులవారికండ్రిగకు అత్యంత సమీపంలోని స్వర్ణముఖి నది ఇసుకను ఆ గ్రామస్తులు గృహవసరాల పేరుతో నేరుగా నాయుడుపేట మండలం మేనకూరు పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన ఇసుక మాఫియా ఇటు రెవిన్యూ అటు పోలీసుల కళ్లుగప్పి యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఈక్రమంలో ఇసుక మాఫియా బుధవారం సమావేశాలు, పంచాయతీలు నిర్వహిస్తూ స్వర్ణముఖి నుంచి వారి గ్రామానికి చెందిన ట్రాక్టర్లు మాత్రమే ఇసుకను పరిశ్రమలకు తరలించేలా తీర్మానం చేసింది. ఇక్కడి అక్రమ ఇసుక తరలింపు మాఫియా ఆగడాలపై ఇటీవల కలెక్టర్‌కు కూడా కొందరు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇకనైనా ఇక్కడి ఇసుక మాఫియా అక్రమ తరలింపు, ఆగడాలపై రెవిన్యూ, పోలీసు అధికారులు దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

కొనసాగుతున్న సీఐటీయూ దీక్షలు

వెంకటగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును బదిలీ చేయాలంటూ సిఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం కూడా కొనసాగాయి. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పదేళ్ల నుంచి రామారావు ఇక్కడే పనిచేస్తున్నారని ఆరోపించారు. అతన్ని బదిలీ చేసేవరకు తాము ఆందోళనను విరమించబోమని స్పష్టం చేశారు.

ఎన్నికల హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వం

డక్కిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని వైసీపీ మండల అధ్యక్షుడు చింతల శ్రీనివాసులు రెడ్డి ఆరోపించారు. గురువారం ఆ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు డక్కిలిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నర్రావుల వేణుగోపాల్ నాయుడు, పెట్లూరు జగన్ మోహన్‌రెడ్డి, కోళ్లపూడి వేణుగోపాల్, బండి రమేష్, మురళీ, కోటి, అరుణాచలం, శంకరరెడ్డి పాల్గొన్నారు.

గోల్‌బాల్ క్రీడల్లో రాణించాలి



కలెక్టర్‌ను కలిసిన బ్రైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసయ్య

వెంకటగిరి, జులై 24 (ఆంధ్రజ్యోతి) : ఈజిప్టు దేశంలో వచ్చేనెలలో బ్రైండ్స్ క్రీడాకారులకు నిర్వహించే జాతీయ స్థాయి గోల్‌బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఎంపికైన బ్రైండ్స్ కీడాకారుడు వెంకటగిరికి చెందిన ముప్పాళ శేషగిరిని కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర బ్రైండ్ స్పోర్ట్స్ అసోషియోషన్ అధ్యక్షులు పరుసూరు పెంచల నరసయ్య ఆధ్వర్యంలో శేషగిరి కలెక్టరును కలిశారు. క్రీడల్లో రాణించి ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రైండ్స్ స్పోర్ట్స్ అసోషియేషన్ కన్వీనర్ రాజా తదితరులు ఉన్నారు.

అభివృద్ధి తక్కువ.. ప్రచారమే ఎక్కువ

వాకాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో అభివృద్ధి తక్కువ ప్రచారం ఎక్కువగా ఉందని వైసీపీ నాయకులు మేరిగ మురళీధర్ అన్నారు. గురువారం నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, రౌతు రామకృష్ణ, బూదనం వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

జయంపులో వైసీపీ ప్రచారం

బాలయపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జయంపులో గురువారం వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికార టీడీపీపై విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దత్తం సిద్ధయ్య, ఎల్లంటి కృష్ణయ్య, వైసీపీ నాయకులు రాజారెడ్డి, వెంకటరమణారెడ్డి, గోపాల్ యాదవ్, వెంకటేశ్వర్లు, రామమూర్తి యాదవ్, లోకనాయుడు, సురేష్ తదితరులు ఉన్నారు.

వైసీపీపై టీడీపీ విమర్శలు అర్థరహితం

కోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరిగినా టీడీపీ నాయకులు విమర్శలు చేయడం అర్థరహితమని వైసీపీ నాయకులు అన్నారు. మండల పరిధిలోని విద్యానగర్ నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో గురువారం మండల వైసీపీ అధ్యక్షుడు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు మాట్లాడారు. గూడూరు వైసీపీ ఇన్‌చార్జి మేరిగ మురళీధర్‌పై టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు రాధాకృష్ణారెడ్డి, నాగూర్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, పాముల సురేంద్ర, కోటయ్య, విజయసారథిరెడ్డి, కోటారెడ్డి ఉన్నారు.

రామలింగచౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు

గూడూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో కొలువైన కోదండరామస్వామి ఆలయంలో గురువారం దేవాంగుల కులదైవమైన రామలింగ చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశిష్టరీతిలో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో శేషగిరి, జగన్, చలమయ్య, చంద్ర, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సారూ ఎలా నడవాలో మీరే చెప్పండి..!?



అధ్వానంగా ఆర్డీవో కార్యాలయం రోడ్డు

సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షమొచ్చినా నీళ్లు నిలబడి ఇలా రొచ్చురొచ్చుగా మారుతోంది. ఆర్డీవో కార్యాలయానికి పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు ఆ అధ్వాన రోడ్డులోనే వెళ్లాల్సి వస్తోంది. రోడ్డు అక్కడక్కడా గుంతలు ఏర్పడి నీరు నిలబడడంతో ద్విచక్ర వాహనదారులు ఆ మార్గంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టేట్ బ్యాంకు వీధిలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. - సూళ్లూరుపేట, (ఆంధ్రజ్యోతి)

అప్పుల్లో ఉన్నా హామీలు నెరవేర్చుతున్న చంద్రబాబు

ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



ఇలుపూరులో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు శంకరయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు

తడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి వచ్చిన సమయంలో రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చుతున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం సూళ్లూరుపేట మండల పరిధిలోని ఇలుపూరు, మంగానెల్లూరు, మంగళంపాడు గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, కార్యదర్శి పాకం వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు గాడి నారాయణ రెడ్డి, దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, ఏలిమేటి సతీష్ మొదలి, శేషాద్రి, వంకా రమేష్, సుబ్రమణ్యం, తిరుపాల్, బుజ్జయ్య, మురళి రెడ్డి, ఎంపీడీవో ఏవీ మురళీకృష్ణ, సీఐ మురళీకృష్ణ, ఏవో కాంచన, ఎంఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ దిమ్మెలు తొలగించారు.. చెత్తను తీయడం మరిచారు



సిమెంట్ దిమ్మెలు ఉన్న చోట పేరుకుపోయిన చెత్త

సూళ్లూరుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరు పేటలోని కచ్చేరివీధిలోని రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి నిర్మించిన సిమెంట్ దిమ్మెలు రైల్వేగేటు దక్షిణవైపు రోడ్డులో అడ్డంగా పెట్టేశారు. దీంతో ఆటువైపు రైల్వేగేటు వేసి తీసినప్పుడు ద్విచక్రవాహనదారులు వెళ్లాలంటే నిరంతరం ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రజలు పలుసార్లు రైల్వే అధికారులకు మొరపెట్టుకున్నారు. ఎట్టకేలకు రైల్వే అధికారులు భారీ క్రేన్‌లు తెచ్చి మూడు రోజుల క్రిం అడ్డంగా ఉన్న సిమెంట్ దిమ్మెలను తొలిగించారు. ఆ దిమ్మెలు కింద పేరుకుపోయిన చెత్త చెదారాన్ని మున్సిపాలిటీ వారు చెత్తను తొలగించలేదు. దీంతో రెండు రోజుల నుంచి కున్తున్న తేలికపాటి జల్లులకు ఆ చెత్తంతా కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు పక్కనే ఉన్న దుకాణ దారులు కూడా ఆ చెత్తలోనే చెత్తను వేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి అక్కడ చెత్తను తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసు బందోబస్తు నడుమ మృతదేహం అప్పగింత



ప్రభుత్వ వైద్యశాల వద్ద గుమికూడి ఉన్న మృతురాలి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు

నాయుడుపేట టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ బందోబస్తు నడుమ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాయుడుపేట షుగర్‌ఫ్యాక్టరీ సమీపంలో అత్త చెంగమ్మను అల్లుడు వెంకయ్య హత్యచేసిన సంఘటన విదితమే. అయితే చెంగమ్మ మృతదేహానికి గురువారం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. చెంగమ్మ హత్యలో వెంకయ్యతోపాటు ఆయన సమీప బంధువుల పాత్ర ఉన్నట్లు మృతురాలు కుటుంబసభ్యులు ఆరోపించడంతో కొంత సమయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రభుత్వ వైద్యశాల వద్ద అర్బన్ సీఐ బాబి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలు కుటుం బసభ్యులు ఆరోపించినట్లుగా వెంకయ్య బంధువులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

గంజాయి జోలికెళితే కఠినచర్యలు: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

తడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గంజాయి జోలికి వెళ్లి ఆరోగ్యాలు పాడుచేసుకోవద్దని అలా వినియోగిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం రాత్రి పలువురు యువకులతో, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. గంజాయి వల్ల జరిగే అనర్థాలను వివరించారు. గంజాయి వినియోగించినా, రవాణా చేసినా చట్టరీత్యా నేరమని తెలియ జేశారు. వీటి వినియోగానికి దూరంగా ఉండేలా తల్లిదండ్రులు సైతం యువతకు చెప్పాలని సూచించారు. లేని పక్షంలో బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్యంగా దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ కొండప్ప నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో అధునాతన వసతులతో విద్య



మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అధునాతన వసతులతో విద్యను అందించి మన్ననలు పొందుతున్నామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. విద్యానగర్‌లోని ఇంజనీరింగ్ కళాశాలలో డైరెక్టర్ విజయ కుమార్‌రెడ్డి గురువారం మాట్లాడారు. ఇక్కడ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీట్లు పెంచడం వలన విద్యార్థులందరికి సరిపోయే విధంగా 1500 కంప్యూటర్లతో నూతన సీఎస్ఈ బ్లాక్‌ను నిర్మించామన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ కోసం 300 కంప్యూటర్లతో నాలుగు అధునాతన ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాశాలలో పీహెచ్‌డీ డిగ్రీ కలిగిన అనుభవజ్ఞులైన అధ్యాపకులతోపాటు జెనిల్ ప్లేస్‌మెంట్ ట్రైనింగ్, హైప్యాకేజీ ప్లేస్‌మెంట్స్ కల్పిస్తున్నట్లు తెలిపారు. బీటెక్‌తోపాటు ఆటోమొబైల్, రోబోటిక్ రంగాలలో శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రెండు ఎంటెక్ కోర్సులను అదనంగా ప్రారంభించామన్నారు. రోబోటిక్స్ డిజైన్ అంశాలలో ఈ ఎంటెక్ కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చేరబోయే విద్యార్థులకు అవసరమైన అదనపు సౌకర్యాలు అన్నింటినీ సిద్ధం చేశామన్నారు. మొదటిదశలో సీట్లు పొందిన విద్యార్థులతోపాటు మేనేజ్‌మెంట్ కోటాలో చేరి విద్యార్థులకు ఆగస్టు 4వ తేదీన తరగతులే మొదలుపెడతామని వివరించారు. ఆయన వెంట పలువురు విభాగాధిపతులు ఉన్నారు.

కూటమిది సుపరిపాలన.. వైసీపీది సుఫారీ పాలన



సుపరిపాలనపై ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

చిట్టమూరు, జులై 24(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుంటే... గత వైసీపీ ప్రభుత్వంలో సుఫారీ పాలన నడిచిందని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ విమర్శించారు. బుధవారం రాత్రి ముక్కిడిపాళెం, పల్లంపర్తి పంచాయతీల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ముక్కిడిపాళెం గ్రామంలో మాటాడుతూ ముక్కిడిపాళెం గ్రామంలో తాగునీటి సమస్య ఉందని మహిళలు తమ దృష్టికి తెచ్చారని, రూ.56 లక్షలు మంజూరు చేసి ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన ప్రకటించారు. టీడీపీ మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు, ఎంపీడీవో మనోహర్ గౌడ్, తహసీల్దార్ సతీష్ కుమార్, టీడీపీ మండల సీనియర్ నాయకులు కామిరెడ్డి సునీల్‌రెడ్డి, మల్లాం ఆలయ కమిటీ చైర్మన్ మునిశేఖర్‌రెడ్డి, ఎం. జనార్ధన్ రెడ్డి, హరికృష్ణా రెడ్డి, కస్తూరయ్య, రాజేష్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గుంపర్ల చిన్నారావు, కాపులూరు చెంచురామయ్య ఆచారి, రషీద్, హరనాథ్, వెంకటరమణయ్య, మణి, అంకబాబు, అంకయ్య తదితరులు ఉన్నారు.

ముగిసిన పీ-4 సర్వే పునఃపరిశీలన గ్రామ సభలు

ఓజిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన పీ-4 సర్వే పునః పరిశీల గ్రామ సభలు గురువారంతో ముగిశాయి. గురువారం మండలంలోని తిరుమలహూడి, వెంకటరెడ్డిపాళెం గ్రామాలలో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఎంపీడీఓ విజయలక్ష్మి పర్యవేక్షణలో స్థానిక పంచాయతీల కార్యదర్శులు, సర్పంచులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తించిన బంగారు కుటుంబాల జాబితాలో ఎవరినైనా చేర్చాల్సి ఉన్నా, సవరించాల్సి ఉన్నా పరిశీలన చేశారు. దాంతోపాటు ఇంకా కొత్తగా బంగారు కుటుంబం కింద వచ్చేవారిని గుర్తించి నమోదు చేశారు.

పీడీఎస్‌యూ నూతన కమిటీ



కమిటీతో విద్యార్థి సంఘ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పీడీఎస్‌యూ విద్యార్థి సంఘ నూతన కమిటీని గురువారం ఏకీగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రతిభ కళాశాల ఆవరణలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్ష, కార్యదర్శిలుగా ఏ.యశ్వంత్, టి.రాహుల్, సహాయ కార్యదర్శిగా టి.చైతన్య, ఉపాధ్యక్షులుగా విష్ణు, సుబ్రమణ్యం, ట్రజరర్‌గా రామ్‌చరణ్‌లను ఎన్నుకున్నారు.

హైస్కూల్ మైదానం చదును



తడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానాన్ని బుల్‌డోజర్‌తో చదును చేస్తున్నారు. జనవరిలో జరిగిన పక్షుల పండుగకు వర్షం రావడంతో మైదానంలో సన్నని కంకర చిప్స్ పోశారు. మైదానంలో కంకర రాళ్లు లేచి గుంతలు పడడంతో వాకర్స్‌కు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రాళ్లపై నడకసాగించడం కష్ట తరంగా మారింది. దీంతో టీడీపీ నాయకులు వేనాటి సురేష్ రెడ్డి స్పందించి గురువారం మైదానంలో చదును చేసే కార్యక్రమం చేపట్టారు.

తూనికల్లో మోసాలు జరిగితే చర్యలు తప్పవు



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ నరసింహారావు

వెంకటగిరిటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యంలో డీలర్లు తూనికల్లో కనికట్టు ప్రదర్శన చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ నరసింహారావు హెచ్చరించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రేషన్ బియ్యం సకాలంలో పంపిణీ చేయాలన్నారు. 1 నుంచి 15వ తేదీలోగా పంపిణీ చేయాలని అన్నారు. 65 సంవత్సరాల పైబడిన వారికి ఇంటింటికీ వెళ్లి సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రతి డీలరు డీడీలు 20లోపు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే పీ-4 సర్వే



మాట్లాడుతున్న మేనేజర్ ఉరుకుందమ్మ

నాయుడుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వాముల ద్వారా పేదరికాన్ని నిర్మూలించడానికే సీఎం చంద్రబాబు పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్ (పీ-4) పాలసీని ప్రారంభించారని నాయుడుపేట మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ అన్నారు. నాయుడుపేట భూపయ్యకాలనీ పరిసరాల పరిధిలోని వార్డుల సభను గురువారం నిర్వహించారు. నిరుపేదలకు అండగా నిలిచేలా ప్రభుత్వం ఆర్థిక ప్రణాళికలను రూపొందించిందన్నారు. వెనుకబడిన కుటుంబాలను దత్తతతీసుకొని వారికి ఆర్థికసాయం, ఉపాధి కల్పించడం వంటివి పీ-4లో భాగమన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు ఉన్నారు.